





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 293 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 29 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 293 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 29 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15 నుంచే అమలు

- మహిళలకు ఉచిత బస్సు... ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే అమలు: సీఎం చంద్రబాబు
- ఎన్నికల వేళ సూపర్ సిక్స్ హామీలు
- హామీల అమలుకు కసరత్తులు చేస్తున్న కూటమి ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై నేడు అధికారులతో చంద్రబాబు సమీక్ష



పెన్ పవర్ డెస్క్:ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 'సూపర్ సిక్స్' లో మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలని సీఎం సూచించారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ విద్యుత్ ఆధారిత ఏసీ బస్సులే ఉండాలని, ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

**ఆర్థిక కష్టాలున్నా హామీలు నిలబెట్టుకోవాలి**

రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా... ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని... అదే సమయంలో ప్రజాధనం సద్వినియోగం కావాలని, ప్రతీ రూపాయి విలువైనదేనని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**వివిధ మోడళ్ల పరిశీలనకు సీఎం ఆదేశం**

"బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి. ఆర్టీసీనే పవర్ జనరేట్ చేసి.... ఈవీ బస్సులు వినియోగించగలిగితే ఎంతమేర మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గుతుందనేది అంచనా వేయండి.

వివరాలు 2లో..

## ఆన్ లైన్ మోసాలు పెరిగాయి... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- విజయవాడలో 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత
- సీసీ కెమెరాల ఏర్పాటుతో రాష్ట్రంలో నేరాలు తగ్గాయన్న మంత్రి
- టెక్నాలజీ వాడకంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుందని ప్రశంస
- ప్రతి గ్రామం, వీధి నిఘా నీడలోకి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి
- ఆలయాలు, చర్చిలు, మసీదుల కోసం 28 సురక్షా డివైస్ కిట్ల పంపిణీ
- ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



పెన్ పవర్ డెస్క్:"గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండండి. క్షణికావేశంలో వాటిని క్లిక్ చేస్తే మీ కష్టార్జితం మొత్తం సైబర్ నేరగాళ్ల పాలవుతుంది" అంటూ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని, సాంకేతి కతను మంచి కోసం ఎంతగా వాడుతున్నామో, చెడుకు కూడా అంతేస్థాయిలో వినియోగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**టెక్నాలజీతోనే నేరాలకు అడ్డుకట్ట**

సైబర్ నేరాలతో పాటు, భౌతిక నేరాలను కూడా సాంకేతిక పరిజ్ఞానంతోనే అరికట్టగలమని మంత్రి అనిత స్పష్టం చేశారు. "రాష్ట్రంలో శాంతిభద్రతల

వివరాలు 2లో..

## తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం

- జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలంలో తప్పిన ప్రమాదం
- మంత్రి కారును ఢీకొట్టిన మరో కారు
- ఊడిపోయిన కారు టైరు
- మరో కారులో ఇంటికి వెళ్లిన మంత్రి లక్ష్మణ్



తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రమాదం నుండి త్రుటిలో తప్పించుకున్నారు జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలం మారుతీ నగర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై మంత్రి ప్రయాణిస్తుండగా... ఆయన కారును మరో కారు ఢీకొట్టింది. దాంతో ఆయన కారు టైరు ఊడిపోయింది. ఈ ప్రమాదం నుంచి మంత్రి

వివరాలు 2లో..

## ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం.. ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

- సుల్తానాబాద్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు అరెస్ట్
- కొత్త ఇంటికి నంబర్ కేటాయించేందుకు రూ. 5 వేలు డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో వల పన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అరెస్టయిన వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్
- లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టీకరణ

వివరాలు 2లో..



## జర్నలిస్టులను చంపేస్తారా? అవసరమైతే కేటీఆర్ ఇంటికి వెళతా!

- నిరసనకు రాళ్లు, రాడ్లు ఎందుకని ప్రశ్నించిన 'మహాన్యూస్' వంశీ
- మహాన్యూస్ తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని వ్యాఖ్య
- కానీ దాడుల సంస్కృతి ఏమిటని నిలదీత
- నరికేస్తాం, చంపేస్తామని బెదిరించడం ఏమిటని ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాల యంపై బీఆర్ఎస్ వర్గీయులు దాడి చేశా రంటూ ఛానల్ ఎండీ వంశీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దాడిని ఖండించారు. నిరసన వ్యక్తం చేయాలనుకుంటే రాళ్లు, రాడ్లు వంటి ఆయుధాలు ఎందుకు తెచ్చారని ఆయన ప్రశ్నించారు. శాంతియుతంగా

వివరాలు 2లో..



## నిజాలు బయటపడుతుంటే ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది... మహా న్యూస్ కు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి

- మహా న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల
- ఇది బీఆర్ఎస్ గూండాల పనేనని తీవ్ర ఆరోపణ
- గతంలో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని వెల్లడి
- ట్యాప్ చేసిన ఆడియోను వైవీ సుబ్బారెడ్డి తనకు వినిపించారని వ్యాఖ్య
- నిజాలు బయటపడుతున్నాయనే భయంతోనే దాడులని విమర్శ
- బీఆర్ఎస్ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

వివరాలు 2లో..



## మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి.. పలువురికి గాయాలు..



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై చోటు చేసుకున్న దాడి గర్హనీయం. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే తెలియచేసే విధానం ఒకటి ఉంటుంది. ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదు. మహా న్యూస్ ఛానెల్ పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు తప్పనిసరిగా ఖండించాలి. ఈ దాడికి కారకులైనవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**వివరాల్లోకి వెళితే..**

హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో ఉన్న మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జూన్ 28, 2025న మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో ఈ దాడి జరిగింది


**దాడి కారణం:**

సోషల్ మీడియా పోస్టుల ప్రకారం, మహా న్యూస్ ఛానెల్‌లో ప్రసారమైన కొన్ని కథనాలు,

వివరాలు 2లో..

## పాకిస్థాన్ లో ఆత్మాహుతి దాడి... 16 మంది సైనికుల మృతి

- ఉత్తర వజీరిస్థాన్‌లో సైనిక కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి
- ఘటనలో 16 మంది పాక్ సైనికులు దుర్మరణం
- 24 మందికి పైగా గాయాలు, వారిలో పౌరులు కూడా
- పేలుడు ధాటికి రెండు ఇళ్ల పైకప్పులు కూలి ఆరుగురు చిన్నారులకు గాయాలు
- తామే దాడికి పాల్పడినట్టు ప్రకటించిన పాకిస్థానీ తాలిబన్లు
- ఆఫ్ఘన్‌లో తాలిబన్ల పాలన తర్వాత పాక్‌లో పెరిగిన హింస



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన

వివరాలు 2లో..

## డిజిటల్ అరెస్ట్ పేరుతో లేడీ డాక్టర్ కు టోకరా... రూ.3 కోట్లు వసూలు!




- ముంబైలో 70 ఏళ్ల వృద్ధ వైద్యురాలికి భారీ సైబర్ మోసం
- డిజిటల్ అరెస్ట్ పేరుతో 8 రోజుల పాటు వర్చువల్ నిర్బంధం
- మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామని నకిలీ ఐపీఎస్ అధికారి బెదిరింపు
- భయపెట్టి విడతలవారీగా రూ.3 కోట్లకు పైగా నగదు బదిలీ
- పోలీసుల దర్యాప్తులో రూ.82 లక్షలు క్రిప్టోలోకి మార్చినట్లు గుర్తింపు
- డిజిటల్ అరెస్ట్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

పెన్ పవర్ డెస్క్:సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో అమాయకుల ను మోసగిస్తున్నారు. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సాగుతున్న మోసాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. చట్టం, పోలీసులంటే ఉండే భయాన్ని ఆసరాగా చేసుకుని, ప్రముఖ కేసుల్లో ప్రమేయం ఉందంటూ బెదిరించి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఈ తరహా మోసానికి

వివరాలు 2లో..

## అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'.. శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా
- శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ
- భారత మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఇది తొలి అడుగు అని పేర్కొన్న ప్రధాని
- అంతరిక్షం నుంచి చూస్తే భూమిపై సరిహద్దులే కనిపించవన్న శుక్లా



పెన్ పవర్ డెస్క్:భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. శుభాంశు శుక్లా ప్రయాణం దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని కొనియాడారు. "మీరు మిషన్ కోసం భౌతికంగా దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, 140 కోట్ల మంది భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ ఈ చారిత్రక యాత్ర ఒక నూతన శకానికి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సన్యాసమే చివరకు?

**నారాయణ స్వామి మౌనం దేనికి సంకేతం?**

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నారాయణ స్వామి యాక్టివ్ గా ఉన్నారు. మంత్రిగా ఐదేళ్ల పాటు కొనసాగారు. అయితే ఎక్సైజ్ శాఖ మంత్రిగా వ్యవహరించిన నారాయణస్వామి మద్యం స్కామ్ కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఆయన పత్తా లేకుండా పోయారు. అసలు పార్టీలో ఆయన ఉన్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతుంది. నారాయణస్వామి మంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తో పాటు లోకేశ్ మిగిలిన కీలక నేతలందరిపై విమర్శలు చేస్తూ వచ్చే వారు. జగన్ మంత్రివర్గంలో నారాయణస్వామి ఐదేళ్ల పాటు కొనసాగడానికి వెనక కూడా ఆయన సామాజికవర్గంతో పాటు చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నిహితుడిగా ఉండటమే కారణం.

**ఐదేళ్లు మంత్రిగానే...**

కళత్తూరు నారాయణ స్వామి కాంగ్రెస్ పార్టీలో రాజకీయాల్లోకి వచ్చార. 1994, 1999లో సత్యవేడు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2004లో తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన 2009లో సత్యవేడు నియోజకవర్గం నుండి ఓడిపోయారు.. 2014, 2019 శాసనసభ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వై.ఎస్. జగన్ మంత్రివర్గంలో 2019 జూన్ 8న ఉప ముఖ్యమంత్రిగా, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఐదేళ్ల పాటు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారంటే జగన్ ఆయనకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతుంది.

**పోటీ చేయకుండానే...**

నాడు చంద్రబాబుపై విరుచుకుపడిన నారాయణస్వామి గత ఏడాది నుంచి పత్తా లేకుండా పోయారు. తాజాగా తిరుపతిలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో కనిపించారు. కానీ పెద్దగా యాక్టివ్ గా లేరు అయితే 2024 ఎన్నికల్లో నారాయణస్వామికి చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేయాలని పార్టీ నాయకత్వం కోరినప్పటికీ అందుకు ఆయన అంగీకరించలేదు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆయన కుమార్తెకు టిక్కెట్ ఇచ్చారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసీపీ నేతలు నారాయణస్వామికి టిక్కెట్ ఇవ్వవద్దంటూ గట్టిగా పట్టుబట్టడంతో జగన్ ఆయనను పక్కన పెట్టారు. అయినా కుమార్తెకు టిక్కెట్ ఇవ్వడంతో కొంత శాంతించిన నారాయణస్వామి ఆమె గెలుపు కోసం పనిచేసినాఫలితం లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని విజయం వరించింది.

**లిక్కర్ స్కాం పై విచారణ జరుగుతున్న సమయంలో...**

అయితే ఆంధ్రప్రదేశ్ లో లిక్కర్ స్కామ్ పై విచారణ జరుగుతున్న సందర్భంగా నారాయణస్వామి మౌనంగా ఉండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే నారాయణస్వామి ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అమెరికాలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లి వచ్చారని, నియోజకవర్గం క్యాడర్ కు కూడా దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. లిక్కర్ స్కామ్ విచారణ జరుగుతున్న సమయంలో ఐదేళ్ల పాటు ఆ శాఖకు మంత్రిగా వ్యవహరించిన నారాయణస్వామి మౌనం ఇప్పుడు అధికార పార్టీకి వరంగా మారింది. అయితే ఇక నారాయణ స్వామి రాజకీయాల నుంచితప్పుకునే ఛాన్స ఉందంటున్నారు. రాజకీయ సన్యాసం వైపు స్వామి అడుగులు వేస్తున్నారన్న టాక్ బలంగా వినిపిస్తుంది.

### మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి..

# పలువురికి గాయాలు..

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి (%దీ=ా%) నాయకుడు కేటీఆర్‌పై తప్పుడు కథనాలు ప్రసారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కథనాలు, థంబ్‌నెయిల్స్ %దీ=ా% కార్యకర్తలలో ఆగ్రహానికి కారణమయ్యాయని చెబుతున్నారు. అయితే %దీ=ా% కార్యకర్తలు మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి, కార్యాలయ అద్దాలు, పలు కార్లను ధ్వంసం చేశారు. కొందరు కార్యకర్తలు ఆఫీసు లోపలికి కూడా ప్రవేశించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి సమయంలో నటుడు సుహాస్ తన చిత్రం 'ఉప్పు కప్పురంబు' ప్రమోషన్ కోసం మహా న్యూస్‌కి ఇంటర్వ్యూ ఇవ్వడానికి వచ్చారు. దాడి కారణంగా ఆయన ఆందోళనకు గురై, వెంటనే అక్కడి నుండి వెళ్లిపోయారు. %దీ=ా% విద్యార్థి విభాగం నాయకులు శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చినప్పటికీ, మహా న్యూస్ సిబ్బంది దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తమైందని, దీంతో %దీ=ాం% నాయకులు తిరిగి దాడి చేశారని కొన్ని పోస్టులు పేర్కొన్నాయి. ఈ ఘటనలో కొందరు %దీ=ాం% నాయకులు గాయపడినట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడిని పలువురు తీవ్రంగా ఖండించారు. జనసేన పార్టీ, ఇతర వ్యక్తులు ఈ దాడిని ప్రజాస్వామ్య విరుద్ధంగా పేర్కొన్నారు. మీడియాపై అభ్యంతరాలు ఉంటే, చట్టపరమైన మార్గాల ద్వారా నిరసన తెలపాలని, దాడులు సమంజసం కాదని సూచించారు. మీడియా గొంతును నొక్కే ఇలాంటి ప్రయత్నాలను సహించరాదని పేర్కొన్నారు. అంతేకాకుండా దాడికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు సోషల్ మీడియా ద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం లేదా పోలీసు శాఖ నుండి ఈ దాడి గురించి అధికారిక ప్రకటన లేదా చర్యలకు సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. అయితే, ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు ఈ ఘటనపై సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ట్విట్టర్లో స్పందించారు. 'హైదరాబాద్ మహా టీవీ హెడ్ ఆఫీసుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజావాణి వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. మహా టీవీపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కథనాలు,ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే, తెలియజేయవచ్చు. వివరణ కోరవచ్చు, ఖండన అడగవచ్చు. ఇటువంటి దాడులు క్షమార్హం కాదు. మహా యాజమాన్యానికి సంఘీభావం తెలుపుతున్నాను.' అని చంద్రబాబు అన్నారు. ఇక, మంత్రి నారా లోకేష్ కూడా మహాన్యూస్ పై దాడిని ఖండించారు. 'తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నాను. హైదరాబాద్ లోని ఛానల్ కార్యాలయంపై దుండగులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదు. ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరు. మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు సంఘీభావం తెలుపుతున్నాను.' అని లోకేష్ అన్నారు.

# ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం.. ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకునే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొత్తగా నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించేందుకు ఓ పౌరుడి నుంచి రూ. 5,000 లంచం స్వీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

**వివరాల్లోకి వెళితే..**

సుల్తానాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనపర్తి వినోద్ కుమార్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ కుమార్ రూ. 5,000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ వ్యక్తి నేరుగా తెలంగాణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, ఫిర్యాదుదారుడు శుక్రవారం నాడు కార్యాలయంలో వినోద్ కుమార్, విజయ్ కుమార్‌లకు రూ. 5,000 ఇస్తుండగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ బృందం వారిని అదుపులోకి తీసుకుంది. లంచం డబ్బును స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సేవలు అందించడానికి లంచం అడిగితే ఏమాత్రం భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా గానీ, ఫేస్‌బుక్ (Telangana ACB%), ఎక్స్ (TelanganaACB) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గానీ, అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు. లంచంపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.

## పాకిస్థాన్ లో ఆత్మాహుతి దాడి... 16 మంది సైనికుల మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయని, ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్టు పాకిస్థానీ తాలిబన్‌కు చెందిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ పదేపదే ఆఫ్ఘనిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను

కాబూల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గ్రూపులు జరిపిన దాడుల్లో సుమారు 290 మంది మరణించారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. తాజా ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతాపరమైన ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

# జర్నలిస్టులను చంపేస్తారా? అవసరమైతే కేటీఆర్ ఇంటికి వెళతా!

- మొదటి పేజీ తరువాయి

కార్యాలయం ఎదుట నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికీ ఇలాంటి దాడులకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. ఒకవేళ మహాన్యూస్ ఏదైనా తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి దాడులను ప్రజలు హర్షిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఇరవై మందికి పైగా కర్రలు, రాళ్లతో దాడి చేస్తుంటే తమ సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆయన తెలిపారు. జర్నలిస్టులపై దాడులు చేస్తే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను చంపేస్తారా? సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? అని ఆయన ప్రశ్నించారు. ఈ దాడి మంచి చేస్తుందా, చెడు చేస్తుందా అని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆలోచించాలని సూచించారు. కొందరు ఈ దాడికి మద్దతు పలుకుతున్నారని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వారిని ఎవరు కాపాడుతారని ఆయన ప్రశ్నించారు. ఈ దాడిపై మహాన్యూస్ తప్పకుండా పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. దాడి చేసింది బీఆర్ఎస్ కార్యకర్తలు, కేటీఆర్ అనుచరులని అర్థమవుతోందని వంశీ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ గురించి, తమ నాయకుడి గురించి ఎందుకు మాట్లాడుతున్నారని దాడి చేసిన వారు నినాదాలు చేశారని ఆయన తెలిపారు. నరికేస్తాం, చంపేస్తాం, పొడిచేస్తామని బెదిరించారని ఆయన వాపోయారు. కేసీఆర్ నాయకత్వంలోని పార్టీలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజాన్ని ఎటువైపు తీసుకువెళుతున్నారని ప్రశ్నించారు. మేము ఏదైనా తప్పు చేసి ఉంటే నిలదీయవచ్చని వంశీ అన్నారు. అవసరమైతే తాను కేటీఆర్ ఇంటికి వెళతానని లేదా కేటీఆర్ తన స్టూడియోకు రావొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ దాడి ఘటనలో కొంతమందిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోందని, పోలీసు విచారణపై తనకు పూర్తి విశ్వాసం

ఉందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేసీఆర్ మాట్లాడితే బాగుంటుందని ఓ జర్నలిస్టుగా తాను కోరుకోవడంలో తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ దాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. మీడియాపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'.. శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!

- మొదటి పేజీ తరువాయి

నాంది పలుకుతుంది. ఇది మన దేశ మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు మొదటి అడుగు వంటిది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే భారత విద్యార్థుల ఆకాంక్షలకు మీ విజయం మరింత బలాన్నిస్తుంది" అని శుక్లాను ఉద్దేశించి ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం వికసిత భారత్ లక్ష్యానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని ప్రశంసలకు శుభాంశు శుక్లా వినమ్రంగా స్పందించారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, యావత్ భారతదేశం సాధించిన సమష్టి విజయమని అన్నారు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వకారణంగా ఉంది. ఇక్కడి నుంచి మన దేశాన్ని మొదటిసారి చూసినప్పుడు, మ్యాప్‌లో చూసిన దానికంటే ఎంతో పెద్దదిగా, మహోన్నతంగా కనిపించింది. ఈ భూమి అంతా ఒకే ఇల్లు, మనమంతా ఒకే కుటుంబం అనే భావన కలుగుతోంది. ఇక్కడి నుంచి చూస్తే దేశాల మధ్య సరిహద్దులు, విభజన రేఖలు కనిపించవు, అంతా ఏకత్వమే కనిపిస్తుంది" అని తన అనుభూతిని పంచుకున్నారు. అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో లేడీ డాక్టర్ కు టోకరా... రూ.3 కోట్లు వసూలు!

- మొదటి పేజీ తరువాయి

గురైన ముంబైకి చెందిన 70 ఏళ్ల వైద్యురాలు ఏకంగా రూ.3 కోట్లు పోగొట్టుకున్నారు. నేరగాళ్లు ఆమెను 8 రోజుల పాటు డిజిటల్ మాధ్యమంలో నిర్బంధించి ఈ దారుణానికి పాల్పడ్డారు.

**అసలేం జరిగిందంటే...!**

ముంబైలో నివసిస్తున్న 70 ఏళ్ల వైద్యురాలికి మే 28న అమిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను టెలికాం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, "మీ ఆధార్ కార్డు ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు కొత్త సిమ్ కార్డు తీసుకున్నారు. ఆ సిమ్ కార్డు వినియోగదారుడిపై ఇప్పటికే కేసు నమోదైంది" అని చెప్పి ఆమెలో ఆందోళన రేకెత్తించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే, ముంబై సైబర్ క్రైమ్ విభాగం పేరుతో ఆమె వాట్సాప్ కు ఒక సందేశం వచ్చింది. కేసు విచారణకు వ్యక్తిగత వివరాలు పంపాలని కోరగా, భయపడిన ఆమె వారు అడిగిన వివరాలన్నీ పంపించారు.

**నకిలీ ఐపీఎస్ అధికారి రంగప్రవేశం**

కొన్ని రోజుల తర్వాత, అదే వాట్సాప్ నంబర్ నుంచి ఆమెకు మరో కాల్ వచ్చింది. ఈసారి ఫోన్ చేసిన వ్యక్తి, తాను ముంబై క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేసే ఐపీఎస్ అధికారి సమర్థన్ పవార్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమె పేరు కూడా ఉందని నమ్మబలికాడు. గోయల్ ఇంట్లో సోదాలు చేస్తుండగా ఆమె పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్, డెబిట్ కార్డు దొరికాయని, ఈ కేసులో తీవ్రమైన శిక్ష పడుతుందని బెదిరించాడు. తన మాటలను ఆమె నమ్మేందుకు, కేసుకు సంబంధించినవంటూ కొన్ని నకిలీ పత్రాలను కూడా వాట్సాప్‌లో పంపించాడు.

**8 రోజుల డిజిటల్ నిర్బంధం**

ఈ పరిణామాలతో తీవ్ర భయాందోళనలకు గురైన బాధితురాలికి, పోలీసు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి వీడియో కాల్ చేసి మాట్లాడాడు. మనీలాండరింగ్ కేసు తీవ్రమైనది కావడంతో ఆమెను 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నట్లు ప్రకటించాడు. 8 రోజుల పాటు ఎక్కడికీ వెళ్లకూడదని, ఎవరితోనూ మాట్లాడకూడదని, నిరంతరం తమ పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించాడు. విచారణలో భాగంగా ఆమె బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును తాము చెప్పే వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయాలని, ఆ డబ్బును పరిశీలించాక తిరిగి పంపుతామని ఒత్తిడి చేశాడు.

కేసు నుంచి బయటపడాలనే ఆందోళనలో ఉన్న ఆ వైద్యురాలు, వారు చెప్పినట్టే విడతలవారీగా దాదాపు రూ.3 కోట్లను వారి ఖాతాలకు బదిలీ చేసింది. 8 రోజుల తర్వాత, కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నామని చెప్పి నేరగాళ్లు ఆమెతో సంబంధాలు తెంచుకున్నారు. జరిగిన విషయాన్ని బంధువులకు చెప్పడంతో, ఇది సైబర్ మోసమని వారు అనుమానించారు. వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు కాజేసిన సొమ్ములో నుంచి రూ.82 లక్షలను ఇప్పటికే క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం

- మొదటి పేజీ తరువాయి

సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. కారు ప్రమాదానికి గురికావడంతో ఆయన మరో వాహనంలో తన నివాసానికి చేరుకున్నారు. ఆయన కొద్ది రోజుల క్రితమే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించిన క్రమంలో ముగ్గురికి అవకాశం లభించగా, వారిలో అడ్లూరి లక్ష్మణ్ ఒకరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

# మహిళలకు ఉచిత బస్సు ఆగస్ట్ 15 నుంచే అమలు

- మొదటి పేజీ తరువాయి

పూర్తి స్థాయిలో కసరత్తు జరగాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అదనంగా 2,536 బస్సులు అవసరం**

కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందని సీఎంకు అధికారులు వివరించారు.

**ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణిస్తారని అంచనా**

రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు. మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది.

**అన్ని రాష్ట్రాలకన్నా ఉత్తమంగా రాష్ట్రంలో అమలు**

ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**57 శాతం పల్లె వెలుగు, సిటీ బస్సు సర్వీసులే**

మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

## నిజాలు బయటపడుతుంటే ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది... మహా న్యూస్ కు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వార్తలు ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను వెలికితీస్తున్న మీడియా సంస్థపై భౌతిక దాడులకు దిగడం అప్రజాస్వామికమని ఆమె అన్నారు. "తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలను ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై, బీఆర్ఎస్ గూండాల దాడిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఛానెల్ లో పనిచేసే సిబ్బందిపై, ముఖ్యంగా మహిళా జర్నలిస్టుల మీద దాడి హేయమైన చర్య. ఇలాంటి దాడులు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాయి. నా ఫోన్ ట్యాప్ చేశారు. ట్యాప్ చేసిన ఆడియోనే వైవీ సుబ్బారెడ్డి గారు నాకు వినిపించారు. ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్లు... ఫోన్ ట్యాపింగ్ విషయంలో మీ దొంగ చెవులను పసిగడుతుంటే దాడులకు దిగుతారా? వాస్తవాలు చెప్పే వాళ్లను చంపాలని చూస్తారా? అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరి ఫోన్లనైనా ట్యాప్ చేయవచ్చా? అడిగినోళ్లకు సైతం ట్యాప్ చేసిన కాల్ రికార్డ్స్ పంపవచ్చా? దొంగతనంగా ఫోన్లు ట్యాప్ చేసి నీచానికి ఒడిగడతారా? తీగ లాగుతుంటే డొంక కదులుతుంది అన్నట్లు సిట్ విచారణలో నిజాలన్నీ బయట పడుతుంటే, ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది. తక్షణమే మహా న్యూస్ యాజమాన్యానికి బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

## ఆన్ లైన్ మోసాలు పెరిగాయి... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే మా లక్ష్యం. టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుండటం అభినందనీయం" అని ఆమె అన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

**ప్రార్థనా మందిరాలకు 'సురక్షా' కవచం**

ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యం. 'సురక్షా 360' కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే సునీత



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 28 :** రాప్తాడు నియోజక వర్గానికి ప్రఖ్యాత గార్మెంట్స్ పరిశ్రమ రేమండ్ సంస్థ రాబోతోంది. గతంలో జాకీ పరిశ్రమ వచ్చిన ప్రాంతంలోనే ఈ పరిశ్రమ రానుందని అనంతపురం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ స్థాపనకు ఆ సంస్థ ముందుకొచ్చిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా జరుగుతున్న సమయంలో అధికారం మారడంతో ఆ పనులు అక్కడితో ఆగిపోయాయన్నారు. కానీ తాము ఎన్నికల ముందు చెప్పినట్టుగా జాకీ పరిశ్రమను తిరిగి రప్పించడం లేదా అదే స్థానంలో ఆ స్థాయికి తగ్గ పరిశ్రమను తీసుకొస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ప్రఖ్యాత రేమండ్ సంస్థ తమ యూనిట్ ను జాకీ స్థానంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. రాప్తాడు దగ్గర 26.87 ఎకరాలను ఎకరా రూ. 20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం స్థిర మూలధన పెట్టుబడి (ఎఫ్సీఐ) కింద రూ.330 కోట్లను పరిగణనలోకి తరువాయి 5లో..

# పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా

# వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలి

### ఎన్టీఆర్ వైద్య సేవ, 20 ఏళ్లు దాటిన పాఠశాల భవనాల స్థితిని తనిఖీ చేసిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు, పెన్ పవర్ జూన్ 28 :** వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ ని రైతులు వాడుకునేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయం – అనుబంధ శాఖలు, వైద్యం ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విద్య అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి టీజీ భరత్‌తో పాటు కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో భాగంగా డ్రోన్ ల మంజూరు కు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 35 కాగా ఇందులో 17 గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించగా, మిగిలిన రైతు గ్రూపులను కూడా త్వరితగతిన ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించాలని మంత్రి జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. డ్రోన్ స్ప్రేయర్‌ల వల్ల కలిగే ప్రయోజనాలు, లబ్ధి గురించి మండల వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా నెట్వర్క్ ఆస్పత్రులు రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నారని ఆదోని ఎమ్మెల్యే ప్రస్తావించగా మంత్రి స్పందించి పథకం సక్రమంగా అమలయ్యేలా విజిలెన్స్ కమిటీని వేసి పర్యవేక్షించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు..ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అంశంలో లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్నారని, అంత ధర ఉందా అని ఈ అంశం మీద దృష్టి పెట్టి, వెరిఫై చేయాలని మంత్రి డిఎంహెచ్ఓ ను ఆదేశించారు.. ఆసుపత్రులలో ఐసీయూ, తదితర విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన పరికరాలను ఏపిఎంసిలో కాకుండా సిపిఎంసిలో తీసుకోవాలని మంత్రి సూచించారు. పారిశుద్ధ్యం అంశంపై చర్చలో భాగంగా తరువాయి 5లో..

#### దేవుని కడప, ఒంటిమిట్ట ఆలయాలను

## పరిశీలించిన టిటిడి జేఈవో





**కడప పెన్ పవర్ జూన్ 28 :** కడప జిల్లాలోని దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం పరిశీలించారు. కడప, ఒంటిమిట్ట ఆలయాల పరిధిలో శనివారం ఆయన వేరువేరుగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించారు. త్వరలోజరుగనున్న బాలాలయం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ గర్భాలయంలో, పోటు గదిలో వర్షం నీరు లీకేజీలు లేకుండా చూడాలని, విద్యుత్ పాత వైర్లు తొలగించి కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గర్భాలయంలో పైభాగాన ఉన్న కాలం చెల్లిన కొయ్య దంతెలను తొలగించే అంశం, ఆలయంలో అవసరమైన గ్రానైట్ పనులు, పోటు పెంపు, పీఏసీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు, ఆలయం చుట్టూ రోడ్ల విస్తరణ, విలువైన వస్తువులు భద్రపరుచుకునేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు, భక్తులకు సౌకర్యవంతంగా పార్కింగ్, నూతన వాహన మండపం, తదితర మరమ్మతుల పనులపై నివేదిక తయారు చేయాలని అధికారులను కోరారు. పుష్కరిణి వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి ఆలయం పరిసరాలలో జరుగుతున్న పనులపై జేఈవో సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరింతగా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కళ్యాణ వేదిక వద్ద భక్తులకు కనిపించేలా శంఖు చక్రాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా ఆలయం సమీపంలో 27 నక్షత్రాలు చెట్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఒంటిమిట్ట ఆలయ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప మునిసిపల్ కమీషనర్ మనోజ్ రెడ్డి, ఎస్.ఈ (ఎలక్ట్రికల్) వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, ఈఈలు నాగరాజు, సుమతి, పలువురు అధికారులు, ఆలయాల అర్చకులు, ఆలయ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం రాక



### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, పెన్ పవర్ జూన్ 28 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు జిల్లా పర్యటన ఖరారు కానున్నది అధికారికంగా ఇంకా ప్రకటన వెలువడ లేదు. సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లు భాగంగా జిల్లా కలెక్టర్ శనివారం సాయంత్రం సమయంలో క్యాంపు కార్యాలయం నుండి టెలి కన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు, కుప్పం లో ముఖ్యమంత్రి నివాసంలో ఒక రాత్రి బస చేసి అనంతరం మరుసటి రోజు ఉదయం సమయంలో అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలిస్తారు, పబ్లిక్ మీటింగ్లో పాల్గొంటారు, పబ్లిక్ మీటింగ్ నందు స్టాల్స్ సందర్శిస్తారు, వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు మెగా చెక్కులు, వివిధ ఆస్తి పనిముట్లు పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డిపిఓ, కుప్పం మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో ఆధ్వర్యంలో శాంతిపురం, కుప్పం మండలాల ప్రధాన కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, బహిరంగస్థలం నందు భారీ కేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, హెలిపాడ్ నందు భద్రత పటిష్టంగా ఉండాలని. ముఖ్యమంత్రి పాల్గొన్న ప్రదేశాలలో పటిష్టమైన భద్రత చేపట్టాలని అధికారులను ఆదేశించారు, బహిరంగ సభ వద్ద, త్రాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్ సీ)ని ప్రారంభించడంతో పాటు, అధికారులతో సమీక్ష జరుపుతారన్నారు. ఇందుకు తగిన విధంగా సిద్ధమవ్వాలని జిల్లాకలెక్టర్ DMHO,DCHO, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కడా పీడీ వికాస్ మర్మత్ కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపద్యంలో వారి వారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేసుకోవాలన్నారు. బహిరంగ సభ వద్ద జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, కుప్పం ఆర్డిఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైవీయూ డిగ్రీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలు విడుదల



**కడప పెన్ పవర్ జూన్ 28 :** యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధం కళాశాలల డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగామినేషన్ ప్రొఫెసర్ కెఎస్వీ కృష్ణారావు తో కలసి విశ్వవిద్యాలయంలోని తన చాంబర్లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ లో జిల్లా వ్యాప్తంగా బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ ,బీకాం, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు 80 కళాశాల నుంచి 55 కేంద్రాలలో నిర్వహించాం. రెండో సెమిస్టర్ అన్ని కోర్సులకు కలిపి 6,679 మంది పరీక్షలకు హాజరుకాగా 3,843 మంది విద్యార్థులు(57.54శాతం) ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. నాలుగో సెమిస్టర్ లో బి ఏ, బి బి ఏ, బి సి ఎ, బీకాం, బీఎస్సీ కోర్సుల విద్యార్థులు 5,902 మంది పరీక్షలకు హాజరు కాగా 3,857 (65.35 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారని వివరించారు. డిగ్రీ అన్ని గ్రూపుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 4,883 మంది పరీక్షలు రాయగా 4,802 (98.34 శాతం)మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులు ఫలితాల అనే వెబ్సైట్ ను సందర్శించాలని కృష్ణారావు సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ సుభోస్ చంద్ర, డాక్టర్ గణేష్ నాయక్ పాల్గొన్నారు.

## చెంబేడులో ఘనంగా అగ్నిగుండ మహోత్సవం

### 3 రోజుల నుండి పాండురంగ భజనలు
### 9 మూరల అగ్నిగుండలో ప్రవేశించిన భక్తులు
### రంగ రంగా అంటూ వేడుకున్న భక్తులు



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** మండలంలోని చెంబేడు గ్రామం నందు 16 వ అనంద అగ్నిగుండ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రీ శ్రీ శ్రీ రుక్మిణి సమేత పాండురంగస్వామి వారి అనంద అగ్నిగుండ మహోత్సవ వేడుకల్లో భాగంగా మొదటి రోజు భక్తులు అందరూ సముద్ర స్నానం ఆచరించారు.మరుసటి రోజున శనివారం ఉదయాన్నే ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు.సాయంత్రం 9 మూరల అగ్నిగుండం త్రవ్వి అగ్నిగుండం వెలిగించారు. భజన గురువు గున్నయ్య దాస్ అగ్నిగుండంలో ప్రవేశించే వారికి కంకణం దారణ చేపట్టారు. పాండురంగస్వామి వారికి కలిశ పూజ ప్రారంభించి భజనలు ఆరంభం చేశారు.అక్కడ వేసిన భజనలలలో భాగంగా కోలాటము, పందరి భజన, జెండా వరుస,కృష్ణ లీలలు,పాండురంగస్వామి దండకం ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి.ఆదివారం తెల్లవారు జామున నరసింహ స్వామి దండకం ముగిసిన అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## పెన్షన్ల పంపిణీలో ఫిర్యాదులు వస్తే చర్యలు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి






**అనంతపురం, పెన్ పవర్ జూన్ 28 :** జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు ఉండరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం లో ఐవిఆర్ఎస్ కాల్స్ ఫీడ్బ్యాక్ పై సచివాలయ ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ కాల్స్ ఫీడ్బ్యాక్ తీసుకోవడం జరుగుతోందని, ఇందులో పెన్షన్లను ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నారా, ఉద్యోగుల ప్రవర్తన ఎలా ఉంది, ఏదైనా అవినీతి గమనించారా అంటూ ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోందన్నారు. ఈ అంశాల్లో జిల్లాలోని పలు సచివాలయాలపై నెగటివ్ రెస్పాన్స్ వచ్చిందని, అందులో అనంతపురం అర్బన్ లో ఎక్కువ నెగిటివ్ రావడం జరిగిందన్నారు. కొంతమంది సచివాలయ సిబ్బందిపై మే నెలలో ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని, ఇప్పటికే సచివాలయ ఉద్యోగులకు సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వడం అయిపోయిందని, ఎవరిపైనైనా మళ్లీ మళ్లీ ఫిర్యాదులు వస్తే అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీలో సరిగా పనిచేయని సచివాలయ ఉద్యోగులు, ఆయా మండలాల ఏపిఎంలపై చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు వారి పనిని సరిగా చేయాలని, పెన్షన్ల పంపిణీ సజావుగా జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, డిపిఓ నాగరాజు నాయుడు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ. 20 లక్షల విలువైన 24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం




వార్త 5లో..

## సమర్ధవంతమైన నాయకులను.. సమన్వయంతో ఎన్నుకోండి



**సూళ్ళూరుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** సూళ్లూరుపేట పట్టణం లోని సత్యసాయి కళ్యాణ మండపం లో శనివారం శాసనసభ్యరాలు నెలవల విజయశ్రీ అధ్యక్షతన జరిగింది. సూళ్లూరుపేట నియోజకవర్గం సంస్థాగత సమావేశం లో పరిశీలకులు డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు, ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ గ్రామా స్థాయి నుండి కార్యకర్తలు సమర్ధవంతమైన నాయకులను ఎన్నుకుంటే తెలుగుదేశం పార్టీ బలోపేతం అవుతుందని ,పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే వారు ఉంటె 2029 లో కూడా మళ్ళీ కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకోవచ్చని ఆయన అన్నారు ,ఈ సమావేశం లో పరిశీలకులు చేజర్ల వెంకటేశ్వర రెడ్డి,రాయి సత్యనారాయణ, బీరం రాజేశ్వర రావు, పచ్చిగార్ల రత్నం , షేక్ రఫీ,నువ్వుల శివరామకృష్ణ,ఇంకా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తులకు నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చూడాలి..!



**కడప, పెన్ పవర్ జూన్ 28 :** జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా.. ఉద్యాన పంటలు, వృక్షాలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా జేసీ అధితి సింగ్ సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణలో ఉద్యాన పంటలు / చెట్లు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అంచనా ప్రక్రియపై.. శనివారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి సంబందిత అధికారులు, ఆయా డివిజన్ల ఆర్డీవోలు, తహాశీలర్లతో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జేసీ అదితి సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు ఎస్డీసి, ఎన్ హెచ్ పీడి వెంకటపతి, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు సాయిశ్రీ, చిన్నయ్య సంబందిత రీజియన్ల ఎన్ హెచ్ఏఐ, ఎన్ హెచ్ పీడిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. బెంగుళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో జమ్మలమడుగు, వి.ఎన్. పల్లె మండలాల్లో ఉద్యాన పంటలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం రాకుండా.. భూసేకరణ చట్టంలోని సంబందింత ప్రామాణికాలను పక్కాగా పాటిస్తూ పరిహారం అంచనాలను నివేదించాలన్నారు. వృక్షాల వయస్సు, చెట్ల పెంపకానికి ఎరువులు, ఫర్టిలైజర్స్ ఇతర నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు రైతులు వెచ్చించిన వ్యయం తదితర అంశాలను ఉద్యాన వన శాఖ అధికారులు ఖచ్చితంగా, పారదర్శకంగా వ్యాల్యూయేషన్ చేయాలన్నారు. వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. కాగా.. ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడి అశోక్ కుమార్, ఆర్&బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్ హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐఎస్‌డి స్టీరింగ్ కమిటీ సభ్యురాలుగా... వైవీయూ అసోసియేట్ ప్రొ. డా.లలిత



కడప పెన్ పవర్ జూన్ 28 : సీనియర్ సిటిజన్స్ విభాగంలో "జెరియాట్రిక్ కౌన్సెలింగ్"పై అడ్వాన్స్ కోర్సు మాడ్యూల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీ లో సభ్యురాలుగా యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె లలితకు చోటు లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్.ఐ.ఎస్.డి) సంస్థ వృద్ధుల కోసం మాడ్యూలను సిద్ధం చేయనుంది. అడ్వాన్స్ కోర్సు అయిన "జెరియాట్రిక్ కౌన్సెలింగ్" కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూళ్ళను అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చైర్మన్ తో పాటు ఆరుగురు సభ్యులు గల స్టీరింగ్ కమిటీని నామినేట్ చేసింది. చైర్మన్ గా ఎన్.ఎస్.ఐ.డి డిప్యూటీ డైరెక్టర్ (సీనియర్ సిటిజన్ డివిజన్) డాక్టర్ హెచ్.సి శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డి, తో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో కూడిన కమిటీలో వైవియూ నుంచి డాక్టర్ లలిత పనిచేయనున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ నైపుణ్య చట్రాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించడం, తగిన అధ్యయన సామగ్రి, అభ్యాస వనరులు, అంచనా పద్ధతులను సిఫార్సు చేస్తారు.స్టీరింగ్ కమిటీ పదవీకాలం కోర్సు మాడ్యూల్స్ చివరిగా పూర్తయ్యే చేసి సమర్పించే వరకు ఉంటుందని ఎన్.ఎస్.ఐ.డి డిప్యూటీ డైరెక్టర్ (సీనియర్ సిటిజన్ డివిజన్) డాక్టర్ హెచ్.సి శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. భారత ప్రభుత్వ జాతీయ సంస్థ లో యోగి వేమన విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకు చోటు దక్కడం ప్రశంసనీయమని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి.పద్మ, సైకాలజీ విభాగాధిపతి డా. వి. లాజర్ సహచర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

## జులై 11 నుంచి వైవీయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కడప పెన్ పవర్ జూన్ 28 : యోగి వేమన విశ్వవిద్యాలయం అలానే అనుబంధ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈఎడీ, ఎం.సి.ఎ రెండో సెమిస్టర్ విద్యార్థులకు జులై నెల 11వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు.జులై 11, 14, 16, 18 , 21, 23 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల పూర్తిస్థాయి టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సీఈ సూచించారు.

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవాలకు ఏర్పాట్లు

తిరుపతి పెన్ పవర్ జూన్ 28 : శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూన్ 30 నుండి జూలై 02 తేదీ వరకు మూడు రోజుల పాటు సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం ఆలయంలో ప్రత్యేకంగా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టారు. వాహనసేవల కోసం పెద్దశేష, హనుమంత, గరుడ వాహనాలను సిద్ధం చేశారు. మొదటి రోజు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రెండో రోజు జూలై 01వ తేదీ హనుమంత వాహనంపై, మూడో రోజు జూలై 02వ తేదీ గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.

**జూలై 03న పార్వేట ఉత్సవం :** జూలై 03వ తేదీన ఉదయం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర, అనంతరం ఉదయం 07 11 గం.ల వరకు ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11-02 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జూన్ 30వ తేదీ నుండి జూలై 03వ తేదీ వరకు నిత్య కళ్యాణోత్సవం, తిరుప్పావడ సేవ, జూలై 01వ తేదీ స్వర్ణపుష్పార్చన, జూలై 02వ తేదీ అష్టోత్తర శతకలశాభిషేకం సేవలను రద్దు చేశారు.


## ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ






కడప పెన్ పవర్ జూన్ 28 : మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్ హోమ్ ఫర్ బాయ్స్, కడప నందు స్పెషలిస్ట్ వైద్యాధికారులు జిల్లా బాల భవిత కేంద్రం,ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.నాగరాజు ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ శిబిరం నందు కళ్ళు, ముక్కు, చెవి, పన్ను మరియు మానసికముగా, శారీరకముగా బాధపడుతున్న బాలురను పరీక్షించి ఆరోగ్యం బాగుగా లేని పిల్లలను తదుపరి చికిత్స కోసం హయ్యర్ సెంటర్స్ కు రిఫర్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్.రమేష్ ,వీరయ్య సూపరిండెంట్,చిల్డ్రన్ హోమ్ బాయ్స్ కడప, స్పెషలిస్ట్ వైద్యాధికారులు రిమ్స్ కడప, నవీన్ కుమార్, జిల్లా బాల భవిత కేంద్రం పర్వజన ఆస్పత్రి, సిబ్బంది హాజరైనారు.

## జిల్లా జైల్, ఓపెన్ జైల్స్ విసిట్



అనంతపురం పెన్ పవర్ జూన్ 28 : అనంతపురం. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి భీమా రావు కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.రాజశేఖర్ జిల్లా జైలును, ఓపినర్ జైలను తనిఖీ చేశారు భీమారావు గారు డిస్టిక్ జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. అక్కడ అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు ఖైదీలకు అందుతున్న వైద్య సేవలను కూడా అడిగి తెలుసుకున్నారు ఖైదీలకు న్యాయ సలహాలు మరియు వారికి అందుతున్న న్యాయ సేవలు గురించి వివరించారు ఖైదీల వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఆవరణ అంతా కలియదిగిరి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట అధికారి జిల్లా జైలు సిబ్బంది ఉన్నారు.

## తిరుపతి, ఎస్.వి.వైద్య కళాశాల రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



తిరుపతి పెన్ పవర్ జూన్ 28 : రుయా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశము, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మరియు తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశమునకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి మౌర్య, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరిండెంట్ డా.జె. రాధ మరియు ప్రసూతి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రమీల, రుయా హాస్పిటల్ అడ్మిన్ అధికారి కనక నరసారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బాలకృష్ణ నాయక్, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ ఆనందమూర్తి, ఆసుపత్రి కమిటీ సభ్యులు బి లక్ష్మీపతి , కాజా మొహిద్దీన్, కరణం సందీప్, APMSIDC ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శివరామరెడ్డి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ముఖ్యమైన క్రింది నిర్ణయాలు తీసుకోబడ్డాయి.

1. మానసిక ఆరోగ్య విభాగము, మరియు కీళ్లు ఎముకల విభాగంలోనూ డ్రైనేజీ పనుల నిమిత్తము రూ 16 లక్షల మంజూరు.

2. రుయా హాస్పిటల్ అంబులెన్స్ కి కొత్త డ్రైవర్ నియామకానికి అనుమతి.

3. క్యాన్సర్ శస్త్ర చికిత్సలకు కావలసిన పరికరాల కొనుగోలుకు రూ 10 లక్షలు మంజూరు.4. హాస్పటల్ రోగుల నిమిత్తము డయాలసిస్ మిషన్ కొనుగోలుకు రూ 8 లక్షల మంజూరు. ఈ సమావేశంలో ప్రసూతి ఆసుపత్రి సంక్షేమ కమిటీ సమావేశం కూడా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నారు.

1.డ్రైనేజ్ రిపేర్ల పని నిమిత్తము రూ 10 లక్షల మంజూరు.

2. రోగులు, వారి సహాయకుల నిమిత్తము 4 పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి రూ 10 లక్షల మంజూరు.

3. రోగుల ఆసుపత్రి పరిధిలో రవాణా సౌకర్యము కొరకు బ్యాటరీ వాహనము మంజూరు.

4. ఆసుపత్రిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా క్రొత్త సిసి రోడ్లు నిర్మాణానికి అనుమతులు.

5. లేబరేటరీ ఆధునీకరణ కొరకు పూర్తి ఆటోమేటిక్ మిషన్ కొనుగోలుకు అనుమతి.

ఈ కార్యక్రమానికి రుయా ఆసుపత్రి, ప్రసూతి వైద్యశాల, మరియు ఎస్ వి వైద్య కళాశాల వివిధ విభాగాల అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, మరియు ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కడప పురుషుల కేంద్ర కారాగారము, ప్రత్యేక మహిళా కారాగారము, విజిట్






కడప పెన్ పవర్ 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు-మరియు-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-మరియు-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు కడప పురుషుల కేంద్ర కారాగారము మరియు ప్రత్యేక మహిళా కారాగారాలను, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, మానసిక వ్యాధులతో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాలను మరియు వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు సకాలంలో మందులను వాడాలని తెలియజేశారు, వైద్యాధికారికి తగు సూచనలు ఇవ్వడం జరిగినది, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారము డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్ రాజేశ్వర్ రావు, మరియు ప్రత్యేక మహిళ కారాగారపు సూపరిండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు, పారా లీగల్ వాలంటరీలు ఖైదీలు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల నాయకులతో ,ఈవీఎం గోదామును తనిఖీ

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



అనంతపురం, పెన్ పవర్ జూన్ 28 : జిల్లాకు సంబంధించి ఎలెక్ట్రానిక్ ఓటింగ్ యాంత్రాములు భద్రపరిచిన గోదాముదు వద్ద పటిష్టమైన భద్రత ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. శనివారం జిల్లా రెవిన్యూ అధికారి మాలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, రాజకీయ పార్టీల నాయకులతో కలసి నగరం లలోని పాత ఆర్డీఓ ఆఫీసు సమీపంలో భద్రపరిచిన ఈవీఎంల గోదామును జిల్లా కలెక్టర్ పరిశీలిం చారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మేరకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోదామును ఓపెన్ చేసి గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, క్షుణ్ణంగా పరిశీలన అనంతరం మళ్ళీ రాజకీయ పార్టీల నాయకులు సమక్షంలో క్లోజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు యోగేశ్వరి దేవి, ఎలెక్షన్ డిటి కనకరాజు, బిజెపి నుంచి యం పి.ఈశ్వర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నుంచి ఈమామ్ వలీ, వైఎస్సార్ పార్టీ నుంచి శ్రీనివాసులు, ఆమాద్మీ పార్టీ నుంచి ఎస్.మసూద్ వలి, జనసేన పార్టీ నుంచి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో మంచినీళ్ల కుంటను కలుషితం కాకుండా చర్యలు : కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి, పెన్ పవర్ జూన్ 27 : తిరుపతి పట్టణంలోని మంచినీళ్ల కుంట కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసు లతో కలిసి జిల్లా కలెక్టర్ మంచి నీళ్లకుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, మంచినీళ్ల కుంటకు ఎంతో చరిత్ర ఉందని, తిరుపతిలో ఏకైక మంచినీళ్ల కుంటగా దీన్ని చెప్పుకోవచ్చని, ఇది సుమారు 100 అడుగుల పైచిలుకు విస్తీర్ణంలో ఉందన్నారు. దీని యొక్క మరొక ప్రత్యేకత శ్రీ గోవిందరాజ స్వామి వారి మూలవిరాట్ విగ్రహం కూడా ఈ మంచినీటి కుంట వద్దే ఉందన్నారు. ఇక్కడి సమీప 30 నుంచి 40 వేల మంది ప్రజలు ఈ నీటి కుంటలో ఉన్న కలుషిత నీరు వారి బోర్లలోకి చేరుతోందన్నారు. అదేవిధంగా రుయా, స్విమ్స్‌ల నుండి కూడా భూగర్భ జల డ్రైనేజీ ద్వారా కలుషిత నీరు ఇందులో కలుస్తుందని స్థానికులు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే కూడా చెప్పడం జరిగిందన్నారు.

ఇదివరకు కూడా తిరుపతి ఐఐటి వారి అభిప్రాయం తీసుకొని దాన్ని ఎలా కలుషితం కాకుండా చూడాలని కోరడం జరిగిందన్నారు.దీన్ని టి టి డి ఆధీనంలోకి తీసుకురావడానికి టిటిడి ఈవో మరియు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అలాగే మూలవిరాట్ గోవిందరాజస్వామి విగ్రహం కూడా ఇక్కడ ఉన్నందున దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అలాగే మరొక మారు తిరుపతి ఐఐటి బృందాన్ని వారి అభిప్రాయాన్ని తీసుకొని దీన్ని ఎలా పునరుద్ధరించాలో తగు చర్యలు కూడా తదుపరి రోజుల్లో తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, తిరుపతి నగరంలో ప్రసిద్ధిగాంచిన మంచినీటి కుంట ఎప్పటి నుంచే ఉందని ,ఈ నీటితోనే గోవిందరాజ స్వామికి అభిషేకం కూడా చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ నీరు కలుషితం కావడం వల్ల ఈ ప్రాంతంలోని సుమారు లక్ష జనాభా కు సంబంధించిన బోర్లలో ఈ నీరు కలుస్తోందని తన దృష్టికి ఇటీవల తీసుకురావడం జరిగిందన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ, టిటిడి వారికి తెలపడం జరిగిందన్నారు. అలాగే ఇక్కడ పెరిగిన చెట్లను కూడా తొలగించమని తెలిపామన్నారు.ఈ నీరు కలుషితం కాకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలో టిటిడి అధికారులతో చర్చించి ,దీనికి మరమ్మతులు చేపట్టడం కలుషిత నీటిని ఎలా శుభ్రం చేయాలో పరిశీలించమని కూడా కోరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వంశి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



పలమనేరు జూన్ 28, (పర్న్ పవర్) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్,సీడాప్ డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా జూలై నెల 4వ తేదిన శుక్రవారం స్థానిక పలమనేరు ఎస్వీసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ జాబ్ మేళాలో 20 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదోవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బి ఫార్మా, డి ఫార్మా విద్యార్హత కలిగిన వారు తప్పక పాల్గొనాలని కోరారు.18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులై ఉండాలన్నారు.ఈ జాబ్ మేళాలో అర్హత లను బట్టి మంచి వేతనం అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలు కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 8465830771, 996356 1755 సంప్రదించ వచ్చున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డిసి జిల్లా ప్లేస్ మెంట్ ఆఫీసర్లు చైతన్య లోకేష్, సిసింద్రీలతో పాటు టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

## వైవీయూలో ఎన్ఎస్ఎస్ స్వచ్ఛతా హీ సేవా




కడప పెన్ పవర్ జూన్ 28 : యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవ పథకం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయం వెస్ట్ క్యాంపస్ నందు ఉన్న ముళ్ళున్న చెట్లను తొలగించారు. "స్వచ్ఛత హి సేవ కార్యక్రమంగా భాగంగ పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నామన్నారు. అందరూ కలసి ప్లాస్టిక్ కవర్స్, వేస్ట్ వాటర్ బాటల్స్ సేకరించి నిప్పుపెట్టారు. చెట్లకు పాదులు తీసి నీళ్లు పట్టారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## డోర్ టూ డోర్ సర్వే ఆధారంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి



చిత్తూరు, పెన్ పవర్ జూన్ 28 : డోర్ టూ డోర్ సర్వే ఆధారంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలు తెలిపారు. ప్రకటనలోను ప్రకటన లోని సారాంశం. విద్యా హక్కు చట్టం ప్రమాణాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని అర్హత కలిగిన పిల్లలును గుర్తించేందుకు మరియు వారి స్కూల్ నమోదు కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం-డోర్ టూ డోర్ సర్వే చేపట్టాలని రేపటినుండి జూలై 12వ తేదీ వరకు నిర్వహించాలి. ఈ డ్రైవ్ ముఖ్యంగా పాఠశాల వయస్సు (6-14) ఉన్న-డ్రాప్ అవుట్ అయిన లేదా ఇప్పటివరకు స్కూల్‌కి వెళ్లనివారిని గుర్తించడానికి చేపడుతోంది. విద్య యొక్క ప్రాధాన్యతతోపాటు విద్యార్థులకు అందు బాటులో ఉన్న వసతులు, ప్రయోజనాలు మరియు ప్రభుత్వ పథకాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే తేదీ నుండి ఒక నెల రోజుల పాటు నిర్వహించబడుతుంది. నన్ను కొట్ట బొమ్మ అయిపోయింది. అన్ని అర్హత కలిగిన పిల్లలను 100% స్కూళ్లలో నమోదు చేయడం. 6-14 సంవత్సరాల వయస్సు గల ఏ పిల్లవాడు స్కూల్‌కు వెళ్లకుండా ఉండకూడదు. డ్రాప్ అవుట్ అయిన పిల్లలను తిరిగి స్కూల్‌కు తీసుకురావడం. పాఠశాల రీఓపెనింగ్ డే నుండి ఒక నెల పాటు నమోదు డ్రైవ్ నిర్వహించడం.

**అమలు విధానం :**

ఈ కార్యక్రమాన్ని క్రింది శాఖల సాయంతో అమలు చేస్తారు:

వెల్ఫేర్&ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు

క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు

సమగ్ర శిక్షలో భాగంగా ఉన్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్

ICDSకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు

పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు

సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో

అంచనాల ప్రకారం లాభాలు :

ప్రభుత్వ మరియు ఎయిడెడ్ స్కూళ్లలో నమోదుల్లో పెరుగుదల.

స్కూల్‌కు వెళ్లని పిల్లలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్చడం ద్వారా డ్రాప్ అవుట్ రేట్లు తగ్గించడం.

విద్య ప్రాధాన్యతపై తల్లిదండ్రుల్లో అవగాహన పెరగడం.

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మెరుగైన అవగాహన ఏర్పడటం.

పిల్లల విద్యను సమాజం సంపూర్ణంగా మద్దతిచ్చే విధంగా కమ్యూనిటీ భాగస్వామ్యం బలోపేతం కావడం. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి పిల్లవాడు నూతనంగా నేర్చుకునే అవకాశం పొందుతూ, విద్యా సౌకర్యాల అందుబాటులోకి రావడం నిర్ధారించబడుతుంది. ఇది సర్వ విద్యా హక్కు సాధనకు దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో విద్యా శాఖను మద్దతుగా లైన్ 12 డిపార్ట్‌మెంట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఖాజాబీ మృతి బాధాకరం కదిరి పార్థసారథి



చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 28 : శీలంవారిపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ మృతి బాధాకరమని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు. శనివారం ఖాజాబీ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్థసారథి ఖాజాబీ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుమారులు షేక్ నాయబ్ రసూల్, షేక్ పాదుషా,ఖాజావలి,సత్తార్ లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్,మౌలాలి, ఉప సర్పంచ్ టి బాబురావు, మాజీ ఎంపిటిసి యం కాశిరెడ్డి, ఇ మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలి

**(3వ పేజీ తరువాయి)** బ్లీచింగ్ పౌడర్‌లో నాణ్యత ఉండాలని, స్థానికంగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే చోట నుంచి నాణ్యత గా ఉన్న బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేస్తే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని మంత్రి తెలిపారు. విద్యపై చర్చలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 20 నుండి 25 సంవత్సరాలు దాటిన పాఠశాలల భవనాల స్థితిని తనిఖీ చేయించాలని మంత్రి ఉమ్మడి జిల్లాల డిఈఓ లను ఆదేశించారు. పాతపడిన భవనాల్లో పిల్లలకు ప్రమాదాలు జరుగకుండా ముందుగానే ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హంద్రీ నది మొదలు నుండి ఓల్డ్ టౌన్ చివర తుంగభద్రలో కలిసే వరకు సిల్ట్ బాగా పెరిగి పోయిందని, కొంచెం వరద వచ్చినా, సమీపంలో నివాసం ఉండే ఇళ్లల్లోకి నీరు వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేయమని చెప్పామని, చేశారా అని మంత్రి ఇరిగేషన్ ఎస్ఈని ఆరా తీశారు.. ప్రతిపాదనలు పంపామని ఎస్ఈ మంత్రికి తెలుపగా, అందుకు సంబంధించిన ఒక కాపీ తనకు కూడా ఇవ్వాలని మంత్రి ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు.

### రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే సునీత

**(3వ పేజీ తరువాయి)** తీసుకుని.. దానిపై ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించిందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి పరోక్షంగా మరికొన్ని వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. రేమండ్ సంస్థ రాప్తాడుకు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాప్తాడు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. దీంతో పాటు ఇటీవల దాదూలూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించామని.. ఇక్కడికి కూడా అనేక కంపెనీలను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అలాగే చెన్నేకొత్తపల్లి ప్రాంతంలో కూడా 4వేల ఎకరాలు ఉందని.. ఇక్కడ రైతులను ఒ?ప్పించి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. ఓవైపు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడంతో పాటు ఇంకో వైపు పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించే పనులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న నాలుగేళ్లలో ఇవన్నీ పూర్తి చేసే విధంగా పని చేస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## రూ. 20 లక్షల విలువైన 24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**తిరుపతి/పెన్ పవర్/ జూన్ 28 :** తిరుపతి జిల్లా రంగంపేట మార్గంలో అక్రమ రవాణా చేస్తున్న 24 ఎర్రచందనం దుంగలతో పాటు, వాటిని తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని, ఒకరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్ఎస్ఏ ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ జి. బాలిరెడ్డి మార్గానిర్దేశకత్వంలో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ లింగాధర్ టీమ్ శుక్రవారం నుంచి భాకరాపేట సెక్షన్ నాగపట్ల బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారు. శనివారం తెల్లవారుజామున రంగంపేట – శ్రీనివాస మంగాపురం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేగంగా వచ్చిన ఒక కారు పోలీసులను చూసి కారు ఆపి ఒక వ్యక్తి దిగి పారి పోతుండగా అతనిని చుట్టుముట్టి అరెస్టు చేశారు. అతనిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో 24ఎర్రచందనం దుంగలు ఉండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 20 లక్షల విలువ ఉంటుందని అంచనా వేశారు. దుంగలు సహా అరెస్టు అయిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి అతనిని విచారించగా, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హైకోర్టు జడ్జి శ్రీనివాసులు రెడ్డిని సన్మానించిన పనబాక గంగరాజు



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** హైకోర్టు జడ్జి శ్రీనివాసుల రెడ్డిని నెల్లూరు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సీనియర్ ఎగ్జి క్యూటివ్ నెంబర్ పనబాక గంగరాజు ఘనంగా సన్మానించారు. శనివారం నెల్లూరు జిల్లా కోర్టును సందర్శించిన హైకోర్టు జడ్జి శ్రీనివాసులు రెడ్డి ని నెల్లూరు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సీని యర్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ పనబాక గంగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి శ్రీనివాసులు రెడ్డికి పనబాక గంగరాజు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ ఆదిలక్ష్మి



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు పారిశ్రామికవాడ నుంచి వచ్చే వాహనాలను నాయుడుపేట ఎస్ఐ ఆదిలక్ష్మి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ఆటోలను, మోటార్ వెహికల్స్ ఆపి మద్యం సేవించున్నారా లేదా అని తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై ఆదిలక్ష్మి మాట్లాడుతూ దివ్య చక్ర వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ వాడాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా మద్యం సేవించి సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసి ప్రాణాపాయం తెచ్చుకోవద్దని తెలిపారు. దివ్య చక్ర వాహనం నడిపేటప్పుడు సరైన పత్రాలు మీ వద్ద ఉంచుకోవాలని అన్నారు. అనంతరం ఆటో,ద్విచక్ర వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశులు, కానిస్టేబుల్ ఉన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

### - కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**కడప పెన్ పవర్ జూన్ 28 :** ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ , జిల్లా ఎస్పీ శ్ర ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి





**అనంతపురం, పెన్ పవర్ జూన్ 28 :** సచివాలయ ఉద్యోగుల బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సిలింగ్ ద్వారా చేపట్టాలన్నారు. రేషనలైజేషన్ ప్రకారం సచివాలయం వారిగా బదిలీలు చేపట్టాలన్నారు. నకిలీ సర్టిఫికెట్లు తీసుకువస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, సొంత మండలానికి ఇవ్వడానికి వీలు లేదన్నారు. ప్రశాంతంగా, ఎలాంటి సమస్య లేకుండా సచివాలయ ఉద్యోగుల బదిలీలను నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, డీఎస్పీ మహబూబ్ బాషా, డిపిఓ నాగరాజు నాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సర్వే ఏడి రూప్లా నాయక్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం పాల్గొన్నారు.

# పొగాకుతో తీవ్రమైన నష్టాలు : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**కర్నూల్ పెన్ పవర్ జూన్ 28 :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రైతులు పొగాకు పంట వేసి తీవ్రంగా నష్టపోతున్నారని, కంపెనీలు పొగాకును కొనుగోలు చేయకపోవడం వల్ల, ఆలస్యం అయి పొగాకు నాణ్యత తగ్గిపోతుందని, తద్వారా రైతులు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.. వచ్చే ఏడాది పొగాకు కొనుగోలులో ఇలాంటి సమస్య మళ్ళీ రాకుండా రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కలెక్టర్ ను కోరారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయాలని, ఏ నియోజకవర్గంలో జొన్నలు ఆ నియోజకవర్గంలోనే కొనుగోలు చేసేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని ఎమ్మెల్యే కలెక్టర్ కు సూచించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు జరుగుతున్నందున ఆళ్లగడ్డలో బ్లడ్ బ్యాంకు, ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రిలో తగినంతమంది డాక్టర్లు, అవసరమైన ఎక్విప్మెంట్ ఉండడం లేదని, వాటిని సమకూర్చాలని ఎమ్మెల్యే కోరారు. కూటమి ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం ఇవ్వడం జరిగిందని, కొన్ని సాంకేతిక కారణాలవల్ల కొంత మందికి తల్లికి వందనం డబ్బులు రాలేదని, సాంకేతిక కారణాలను సరిచేసి వెంటనే వారికి డబ్బు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యాశాఖ అధికారులను కోరారు. అలాగే కొంతమంది పొదుపు మహిళలకు తల్లికి వందనం డబ్బులు రాగా బ్యాంకర్లు ఆ డబ్బులను పాత అప్పులకు జమ చేసుకుంటున్నారని, ఇది సరికాదని, అలా అప్పులకు జమ చేసుకోకుండా, తల్లికి వందనం డబ్బులను మహిళలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కలెక్టర్ ను కోరారు. ఆళ్లగడ్డ లో శిల్పా వెంచర్ కు అనుమతులు లేకుండా కేసీ కెనాల్ మీద వెంచర్ వేశారని, దీని వల్ల 7,000 ఎకరాలకు నీరు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఈ అంశంపై అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. కేసీ కెనాల్ ఆయకట్టు చివరి భూముల వరకు నీటిని అందించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే కళ్ళముందే తెలుగు గంగ ప్రవహిస్తున్నా, తమ నియోజకవర్గంలో ఆయకట్టుకు నీరు రావడంలేదని, సాగుభూమి ఎక్కువగా ఉంది కానీ, భూములకు నీరు తక్కువగా ఉందని , ఇది చాలా బాధాకరమైన విషయమని ఎమ్మెల్యే తెలిపారు. ఫీల్డ్ మీదికి అధికారులు రావడంలేదని, రైతులకు పంట లకు నీరు ఎప్పుడు వదులుతారు , ఎంత నీరు ఇస్తారు అని చెప్పకపోవడంతో రైతులు పంటలు వేసుకుని, నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంలో వ్యవసాయ శాఖ ఇరిగేషన్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు తగిన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో అంగరంగ వైభవంగా ఫాదర్స్ డే వేడుకలు



**శ్రీ కాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 28 :** శ్రీకాళహస్తి స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కారక్రమానికి ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థుల తండ్రులను పిలిపించడం జరిగింది. పాఠశాల ఆవరణ లో ఫాదర్స్ డే ప్రముఖ్యతను తెలిపేలా బోర్డు ఫ్రేమ్ ను అలంకరించడం విచ్చేసినవారిని ఆకర్షితులను చేసింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, విజయాన్ని సాధిస్తున్న శ్రీ చైతన్య విద్యార్థులకు తండ్రితో సమానమైన శ్రీ చైతన్య యాజమాన్యం బి,యన్ ,రావు చిత్రపటాన్ని నిలిపి ఉపాధ్యాయులు విద్యార్థులు జ్యోతి ప్రజలన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ "గెలిచినప్పుడు ఆనందంగా పదిమందికి చెప్పుకుని, ఓడినపుడు మన భుజం తట్టి ధైర్యం చెప్పేవాడు నాన్న ఒక్కడే" అని విద్యార్థులకు సందేశాన్ని ఇస్తూ, ఈరోజు ల్లో ఒక్క పూటైనా తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి భోజనం చేస్తూ ఆ రోజు గడిచిన విషయాలను గురించి మాట్లాడుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన తండ్రులకు ఫోల్డింగ్, బాల్ బ్యాలెన్సింగ్, ర్యాంప్ వాక్ మొదలైన కార్యక్రమాలను నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏ,జి, ఎం,సురేష్ మాట్లాడుతూ విచ్చేసిన తండ్రులందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రీ ప్రమరి కో–ఆర్డినేటర్ అమ్మాజీ , ప్రైమర్ కో–ఆర్డినేటర్ లాద్యగారు, ఏ ఓ, సురేష్ ,పి ఈ టి మేఘన, ఇన్చార్జులు కల్పన, వాసంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధం...

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 28 :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి సంబంధించిన మరియు సివిల్ సప్లయిస్ సన్నద్ధతపై డిఆర్డీఏ పిడి, డిఎస్ఓ, సివిల్ సప్లయిస్ డిఎం, ఎల్డిఎం, ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకు నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సిఎస్డిటిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1వ తేదీన ఉదయం 7 గంటలకి పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం 30వ తేదీకల్లా బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకర్లతో మానిటర్ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఎల్డీఎంని ఆదేశించారు. లబ్ధిదారులకు నమస్కారం చేస్తూ మంచి మాటలతో పలకరించి ఆడియో వినిపించి పెన్షన్లను అందజేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం నియోజకవర్గ, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్స్ ఫీడ్ బ్యాక్ ప్రతినెల రావడం జరుగుతుందని, అందులో నెగటివ్ ఫీడ్ బ్యాక్ రాకుండా జాగ్రత్తగా పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పెన్షన్ల పంపిణీ చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పంపిణీ కానీ అన్ పెయిడ్ పెన్షన్లను రెండు రోజుల్లో బ్యాంకుకు తిరిగి కట్టాలన్నారు. సివిల్ సప్లయిస్ సంబంధించి అన్ని ఎఫ్.పి షాపులకు పెండింగ్ లేకుండా రేషన్ సరుకులను వెంటనే అందజేయాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే ప్రకియను శనివారంలోపు 40 శాతం పూర్తి చేయాలని, 30వ తేదీలోపు పూర్తిగా అందించాలన్నారు. సివిల్ సప్లయిస్ అంశాలకు సంబంధించి ఏపీ సేవా సర్వీసెస్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెంబర్ డిలీషన్ ఇన్ రైస్ కార్డ్, కరెక్షన్ ఆఫ్ రాంగ్ ఆధార్ సీడింగ్, రైస్ కార్డ్ యూనిట్స్ ఈ–కేవైసీ, తదితర అంశాలకు సంబంధించి పెండింగ్ ను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఒకటో తేదీన ఎఫ్.పి షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డిఏ పిడి శైలజ, ఎల్డిఎం నరేష్ రెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి




**పలమనేరు జూన్ 28,(పర్న్ పవర్) :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్,సీడాప్ మరియు డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా జూలై నెల 4వ తేదిన శుక్రవారం స్థానిక పలమనేరు ఎస్వీసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపు నిచ్చారు.శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ జాబ్ మేళాలో 20 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదోవ తరగతి, ఇంటర్,ఐటీఐ,డిగ్రీ,బీటెక్ ,బి ఫార్మా,డి ఫార్మా విద్యార్హత కలిగిన వారు తప్పక పాల్గొనాలని కోరారు.18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులై ఉండాలన్నారు.ఈ జాబ్ మేళాలో అర్హత లను బట్టి మంచి వేతనం అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలు కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 8465830 771, 9963561755 సంప్రదించ వచ్చున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డి సి జిల్లా ప్లేస్ మెంట్ ఆఫీసర్లు చైతన్య లోకేష్, సిసింద్రీలతో పాటు టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



సిపిఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు సిపిఐ మండల కార్యదర్శి యస్ కె వై పెద్దమస్తాన్ పిలుపు నిచ్చారు ఈ సందర్భంగా చంద్రశేఖరాపురం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం సమీపంలో సిపిఐ రాష్ట్ర మహాసభల కర్ర పత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర మహాసభలు కార్మిక రైతు మధ్యతరగతి సమస్యలపై దృష్టి సారిస్తాయని తెలిపారు భారతదేశంలో కార్మికులు రైతులు శ్రామిక వర్గాల హక్కుల కోసం అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించిన ఘన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, దేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ ఏర్పడి నేటికి 100 సంవత్సరాలు పూర్తిఐన సందర్భంలో సమాజంలో సామాజిక ఆర్థిక సమానత్వం కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులు,కర్షకులు రైతుల హక్కుల కోసం పోరాడి విజయం సాధించి జమీందారీవ్యవస్థరద్దు, భూపంపిణీ, పంటలకు గరిష్ట మద్దతు ధరల కోసం, సాగునీటి ప్రాజెక్టులు, ఎరువులు, విత్తనాల ధరలు తగ్గించేలా అనేక ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టి ఆకర్షించిందన్నారు. సిపిఐ పార్టీ అధికారం లేకపోయినప్పటికి అప్పటి నుండి ఇప్పటి వరకు పార్టీ సిద్ధాంతాలను తూచాతప్పకుండా పేదల కొరకు, కార్మిక కర్షక రైతుల ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అలుపెరగని ఉద్యమాలు పోరాటాలు చేసిందని అన్నారు భారత కమ్యూనిష్టు పార్టీ 100 సవత్సరాల నుండి నమ్మిన సిద్ధాంతాల కొరకు దేశంలో ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చిన ఒక కమ్యూనిష్టు పార్టీ సిపిఐ మాత్రమే పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కొరకు ఉద్యమాలు చేస్తుందని మండలంలోని మేధావి వర్గం, రైతులు, ఉద్యోగులు, ప్రజలు సహృదయతో పార్టీకి నిధి విరాళాలు ఇచ్చి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జాయింట్ కార్యదర్శులు జి నరసింహులు, యస్ కె వై మౌలాలి, యస్ రమేష్, గోవింద్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## నడకే ఆరోగ్య భాగ్యం
## నేడు 163 వ వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మీట్




**తిరుపతి/పెన్ పవర్/జూన్ 28 :** వయసు పైబడిన ప్రతి మనిషికి నడకే ఆరోగ్య భాగ్యమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ప్రభావతి పేర్కొన్నారు. శనివారం తిరుపతిలో జరిగిన వాకర్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ ఎలక్ట్ గవర్నర్స్ ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎలెక్ట్ గవర్నర్ డాక్టర్ పాతపాటి రవిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభావతి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో ఎంపికైన గవర్నర్స్ కు శిక్షణ తరగతులు తిరుపతిలో జరగడం అభినందనీయమన్నారు. డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం వైజాగ్ లో ఆల్వార్ దాస్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో ఏర్పడిన వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ నేడు అయిదు లక్షల మంది సభ్యులు కలిగి ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను పది లక్షలకు చేర్చి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. పాస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు డాక్టర్ రామానందం మాట్లాడుతూ నూతనంగా ఎలక్టయినా గవర్నర్లకు విధివిధానాలను వివరించి ప్రతి మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ శర్మ మాట్లాడుతూ సభ్యత్వ సంఖ్యను పెంచి క్లబ్బులను నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా నేడు 163వ వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మీటును తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి డాక్టర్ రవి రాజు, డాక్టర్ రమానందం, డాక్టర్ శర్మ, సీతారామయ్య కృష్ణకుమారి సుబ్బారెడ్డి నాగభూషణం ఐజాక్ డాక్టర్ విజయలక్ష్మి కోనేటి రవిరాజు మాధవ నాయుడు అమర్నాథ్ పేరూరు సుధాకర్ రెడ్డి కృష్ణారావు గోపి చల్ల ముని కృష్ణయ్య ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ రావు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## 14 రోజుల్లోపు విద్యుత్ బిల్లులు చెల్లించండి
### సర్ చార్జీల నుండి ఆదా చేయండి.. ఏఏవో, బి.నాగేశ్వరరావు




**తొట్టం బేడు/పెన్ పవర్/జూన్ 28 :** శ్రీకాళహస్తి నియోజకవర్గ మండల,పట్టణం ప్రజలు విద్యుత్ బిల్లులు 14 రోజులు లోపల బిల్లు చెల్లించిన యెడల ఎటువంటి సర్ చార్జీలు ఉండవని, ఏఏవో, వీఆర్ఓ, బి,నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు బిల్లులు ఇచ్చిన 14 రోజుల తర్వాత అదనపు సర్ చార్జీలు విధించబడును, అదేవిధంగా సర్ చార్జీ, జరిమానాలను నివారించడానికి విద్యుత్ బిల్లు అందిన 14 రోజుల్లోపు విద్యుత్ బిల్లులు చెల్లించి, సర్ చార్జీలు నుండి ఆదా పొందవచ్చు అని, మీ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని, లేదంటే విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించవలసిందిగా ఏ,ఏవో నాగేశ్వరరావు తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన కారు




**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం. తాల్వాయి పాడు జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా మలుపు తిప్పడంతో వెనుక వస్తున్న కారు బస్సును ఢీ కొట్టినది. బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళు తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడు మందిలో రవీందర్ రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి ,చంద్రకలకు, గాయాలయ్యాయి. వీరిని నాయుడుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## బంగారు బాల్యం సర్వే పూర్తి చేయాలి



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 28 :** మండలంలోని బంగారు బాల్యం సర్వేలను నిర్వహించి పూర్తి చేయాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య ఆదేశించారు చంద్రశేఖరపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని సచివాలయాల మహిళా పోలీసులకు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారి భవిష్యత్తు కోసం బంగారు బాల్యం సర్వే ద్వారా పిల్లల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టిందని బంగారు బాల్యం యాప్ ఆధారిత సర్వేను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు ప్రతి చిన్నారి భవిష్యత్తు కోసం ఈ సర్వే కీలకం అందుకే ప్రతి కుటుంబాన్ని చేరుకొని వారి పిల్లల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు తల్లిదండ్రులు లేని పిల్లలను, పేదలను సర్వేలో గుర్తించాలని తెలిపారు ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని, సర్వేలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, ఈవోపీఆర్డి రమణయ్య, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యం వెల..

### ఎంతటి సంక్షోభం వచ్చినా భగవంతునిపై విశ్వాసం వమ్ము కాకూడదు
### కృష్ణారెడ్డి సమ్మిరెడ్డి పెన్ పవర్ కడప శ్రీరామచంద్ర మిషన్






**కడప పెన్ పవర్ జూన్ 28 :** కాశీ పట్టణంలో ధనవంతుడు అయిన ఒక బ్రాహ్మణుడు వుండేవాడు. అతను ప్రతీ రోజు దాన ధర్మాలు చేసేవాడు. దానికి తోడు మిక్కిలి దైవ భక్తి కలవాడు మరియు యజ్ఞ యాగాదులు కూడ చేసేవాడు. ఒక యాగంలో అన్నీ దానం చేయటంతో కుటుంబ పోషణకు అతడి వద్ద డబ్బులు లేకుండా పోయాయి. పక్క ఊరిలో ఒక పెద్ద సేఠ్ నివసిస్తున్నాడని అతడు ఇతరుల పుణ్యంను కొని ధనం ఇస్తాడని బ్రాహ్మణుడి భార్య అతనికి చెప్పి వారి వద్దకు వెళ్లి మీ పుణ్యాలు అమ్మి కొంత డబ్బు తీసుకురండి, తద్వారా వ్యాపారం మళ్లీ ప్రారంభం చేయవచ్చును అని సలహా ఇస్తుంది. బ్రాహ్మణుడు మాత్రం తను చేసిన పుణ్యం అమ్మడానికి ఇష్టపడలేదు, కానీ భార్య ఒత్తిడి మరియు పిల్లల బాధల కారణంగా అతను పుణ్యం అమ్మడానికి సిద్ధపడక తప్పలేదు.

దారిలో తినడానికి భార్య ఇచ్చిన నాలుగు రొట్టెలు తీసుకొని ప్రయాణం అవుతాడు. అతను నడుచుకుంటూ అడవిలో నుండి పోయేవేళ ఆకలి కావటంతో ఊరికి చేరేలోపు భోజనం ముగించాలి అనుకుని రొట్టె తీయగానే ఒక కుక్క వచ్చి తన మూడు కుక్కపిల్లలతో ఎదుట నిలబడుతుంది. పిల్లలు చాలా చిన్నవి కావడంతో వాటిని వదిలి ఊరులోకి వెళ్లలేకపోయింది. బ్రాహ్మణునికి బాధగా అనిపించి అతను కుక్క పై కుక్కపిల్లల కోసం జాలిపడి, తన దగ్గర ఉన్న రొట్టెల నుండి ఒక రొట్టెను కుక్కకు ఇస్తాడు. కుక్క చాలా రోజులుగా ఆకలితో ఉండటంతో, కుక్క త్వరగా రొట్టె తినేసింది, కానీ ఇంకా ఆకలితో ఉండటంతో బ్రాహ్మణుడి వైపు చూపసాగింది. బ్రాహ్మణుడు జాలిపడి రెండవది, తరువాత మూడవది, చివరి నాల్గవది అలా మొత్తం రొట్టెలు కుక్కకు వేసి తను మాత్రం కేవలం నీరు త్రాగి సేఠ్ వున్న వూరికి చేరుకొంటాడు. బ్రాహ్మణుడు సేఠ్‌తో తన పుణ్యాన్ని అమ్ముకోవడానికి వచ్చానని చెప్పుతాడు. అప్పుడు సేఠ్ 'నేను చాలా బిజీగా ఉన్నాను, సాయంత్రం రండి, నేను కొంటాను!' అని అంటాడు. మధ్యాహ్నం సేఠ్ తన ఇంటికి భోజనానికి వెళ్లి 'తన పుణ్యాన్ని విక్రయించడానికి ఒక బ్రాహ్మణుడు వచ్చాడని భార్యతో చెప్పుతాడు. అతని దగ్గర నేను ఏ పుణ్యం కొనాలి చెప్పు!' అని సలహా అడుగుతాడు. సేఠ్ భార్య చాలా మంచి పతివ్రత స్త్రీ. ఈరోజు బ్రాహ్మణుడు రొట్టెలన్నీ కుక్కకు ఇచ్చి చాలా పుణ్యం సంపాదించుకున్నాడని కండ్లు మూసుకొని ధ్యానం చేసి తెలుసుకొంటుంది. కుక్కలకు రొట్టెలు వేసి సంపాదించిన పుణ్యాన్ని బ్రాహ్మణుడి నుండి కొనమని తన భర్తకు చెబుతుంది. సాయంత్రం బ్రాహ్మణుడు తన పుణ్యాన్ని విక్రయించడానికి వచ్చినపుడు సేఠ్ ఇలా అంటాడు. ఈరోజు నువ్వు చేసిన యజ్ఞం యొక్క పుణ్యాన్ని నేను కొనాలని అనుకొంటున్నాను. బ్రాహ్మణుడు నవ్వి ఇలా అంటాడు 'నా దగ్గర యజ్ఞానికి సరిపడ ధనం ఉంటే నీకు పుణ్యం అమ్మడానికి వచ్చేవాడినా? అని. ఈరోజు ఆకలితో ఉన్న కుక్కకు ఆహారం పెట్టి ఆ కుక్కను, దాని పిల్లలను నువ్వు రక్షించావు. అదే యజ్ఞం!' అని సేఠ్ అంటాడు. నువ్వు సంపాదించిన ఆ పుణ్యాలన్నీ నేను కొనాలని అనుకొంటున్నాను!' అని అంటాడు. బ్రాహ్మణుడు పుణ్యం అమ్మడానికి అంగీకరిస్తాడు. దానికి బదులుగా నీకు నాలుగు రొట్టెల బరువుకు సమానంగా వజ్రాలు, ముత్యాలు ఇస్తానని సేఠ్ అనటం దానికి బ్రాహ్మణుడు కూడ అంగీకరించడం జరిగిపోతాయి. నాలుగు రొట్టెలు తయారు చేసి త్రాసులో కాటాకు ఒక ప్రక్కన ఉంచబడతాయి. రెండవ దానిలో, సేఠ్ ఒక సంచీ నిండా వజ్రాలు, ముత్యాలు మరియు ఆభరణాలు ఉంచుతాడు.

త్రాసు యొక్క కాటా కొంచెం కూడ కదలదు. రెండవ సంచీ ఉంచినాకూడా కాటా కొంచెంకూడ కదలక పోయేసరికి సేఠ్ తన దగ్గర వున్న ఆభరణాలు అన్నీ రెండో దిక్కున వుంచినా కూడ కాటా అసలుకే కదలదు. అది చూసిన తర్వాత అక్కడ వున్న వారందరు ఆశ్చర్య పోతారు. అప్పుడు బ్రాహ్మణుడు సేఠ్‌తో, "నేను నా మనసు మార్చుకున్నాను. ఇప్పుడు నా పుణ్యాన్ని నీకు అమ్మడం ఇష్టం లేదు!" అని రిక్త హస్తాలతో తన ఇంటికి ప్రయాణం అవుతాడు. ఇంట్లోకి అడుగు పెట్టగానే భార్య తనతో గొడవ పడుతుందేమోనని భయపడి, దారిలో కుక్కకి రొట్టెలు ఇచ్చిన చోటు నుంచి కొన్ని గులకరాళ్లు, రాళ్లను ఏరుకుని దానితో ఒక మూటనూ తయారు చేసి ముడి వేస్తాడు. ఇంటికి చేరుకోగానే అతని భార్య పుణ్యాన్ని అమ్మి ఎంత సంపాదించావు అని అడగటం తో ఆ రాళ్ల మూటను భార్యకు ఇచ్చి అప్పు దొరుకుతుందేమోనని గ్రామం లోకి వెళ్ళుతాడు. ఇక్కడ అతని భార్య ఆ మూటను చూసి ఆగలేక, భర్త వెళ్లగానే ఆ మూట తెరిచి చూస్తుంది. ఆ మూట నిండా వజ్రాలు, నగలు ఉండటంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండా పోతాయి. బ్రాహ్మణుడు ఇంటికి తిరిగి రాగానే అతని భార్య మీ పుణ్యానికి ఇంత మంచి ధర ఎవరు చెల్లించారని అడుగుతుంది. మీకు ఇన్ని వజ్రాలు మరియు ఆభరణాలు ఎక్కడ నుండి వచ్చాయి? అంటుంది. వజ్రాలు, నగలా ? ఎక్కడ ఉన్నాయో చూపించు!" అని అంటాడు బ్రాహ్మణుడు. భార్య తన ముందు ఉన్న మూటను విప్పగానే అందులోంచి విలువైన ఆభరణాలు బయట పడటంతో బ్రాహ్మణుడు కూడా ఆశ్చర్యపోతాడు. అప్పుడు అతను తన భార్యకు జరిగిన విషయాలు అన్నీ పూస గుచ్చినటుల చెబుతాడు. విపత్తు సమయంలో తన పుణ్యంను విక్రయించమని అతనిని బలవంతం చేసినందుకు అతని భార్య చాలా బాధపడుతుంది.

**ఇదీ కథ :** నిజానికి ఇది కథ కాదు. జీవితం! ఈ కలిలో, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టండి. ఆపదలో ఉన్న వారికి సాయం చెయ్యండి. మీకు ఎంత డబ్బున్నా ఇహలోక ప్రయాణానికే. మీ డబ్బును ఎవరైనా దొంగిలించవచ్చు. కానీ, మీ పుణ్యాన్ని ఎవరూ దొంగిలించలేరు. అందుకే, మీ దగ్గర ఉన్న డబ్బును పుణ్యంగా మార్చుకోండి. పరలోక ప్రయాణానికి పుణ్యం తోనే టిక్కెట్టు కొనుక్కోండి. దేవుడు మనల్ని పరీక్షిస్తాడు! మనం ఆ పరీక్షలో ఉత్తీర్ణులైతే, మనల్ని శాశ్వతంగా ఆశీర్వదిస్తాడు! అందుకే ఎంతటి సంక్షోభం వచ్చినా భగవంతునిపై విశ్వాసం వమ్ముకాకూడదు.?? పెన్ పవర్ కృష్ణారెడ్డి . కడప శ్రీరామచంద్ర మిషన్.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు
లోకా సమస్తా సుఖినోభవన్తు

## శ్రీకాళహస్తి మండలం, వేడం పంచాయతీలో అధికార దుర్వినియోగం






**శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 28 :** వేడం పంచాయతీలో ఎంఈఓ భువనేశ్వరి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. "మా బడి మాకు కావాలంటే కేసులు పెట్టమని కలెక్టర్ చెప్పారు" అంటూ గ్రామస్తులను బెదిరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ విషయంలో గ్రామస్తులతో ఎలాంటి చర్చలు లేకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిని కేసులతో బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిరంకుశ వైఖరి: "నేను చెప్పిందే వేదం, మేము చేసింది రాజ్యం" అన్నట్లుగా అధికారుల వైఖరి ఉందని, బ్రిటిష్ పరిపాలనను తలపిస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన అధికారులని, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సేవకులని మరచిపోయి, తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను, సమస్యలను పట్టించుకోకుండా, తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, వారిపై కేసులు పెడతామని బెదిరించడం దారుణమని గ్రామస్తులు మండిపడుతున్నారు. న్యాయం జరగదన్న నిరాశ: ఏ అధికారి వచ్చినా న్యాయం జరగదని గ్రామస్తులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కోశాధికారితో సహా ఎవరూ స్పందించడం లేదని, తమ గోడు వినే నాథుడే లేడని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, ఎవరూ స్పందించకపోవడంతో న్యాయం జరుగుతుందనే ఆశను కోల్పోతున్నామని, తమ సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్ పైనే భారం: "కలెక్టరే చేయాలి, మాదేమీ లేదు" అంటూ ఎంఈఓ భువనేశ్వరి బాధ్యతను తప్పించుకుంటున్నారని గ్రామస్తుల ఆగ్రహం. "మా చెప్పిందే రాష్ట్రంలో అమలవుతుంది" అంటూ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రశ్నించే హక్కు తమకు లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ విషయంలో జోక్యం చేసుకొని, వేడం పంచాయతీ గ్రామస్తులకు న్యాయం చేకూర్చాలని వారు కోరుతున్నారు. అధికారుల నిరంకుశ వైఖరి, బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పోలీస్ శాఖకు ఆధునిక డ్రోన్ బహూకరణ : తాళ్లూరు పోలీస్ స్టేషన్‌కు అందజేత

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 28 :** ప్రకాశం జిల్లా పరిధిలో లా & ఆర్డర్ నిర్వహణ, నేరాలు నియంత్రణ, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల నిమిత్తం తాళ్లూరు మండలం, విఠలాపురం కాలనీ చెందిన మారం అనంతరెడ్డి, వైకుంఠ రామాలయం దేవాలయ కమిటీ వారు శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అత్యాధునిక సాంకేతికత కూడిన డిజేఐ ఎయిర్3ఎస్ డ్రోన్ కెమెరాను జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ కు అందజేశారు. పోలీస్ శాఖ పట్ల సామాజిక బాధ్యత, సేవా దృక్పథాన్ని చూపుతూ, డ్రోన్‌ను బహుకరించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ బహుకరించబడిన డ్రోన్ ను తాళ్లూరు పోలీస్ స్టేషన్ కు జిల్లా ఎస్పీ అందజేశారు.




## లారీని ఢీకొన్న కారు ఒకరు మృతి



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 28 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం నాయుడుపేట టు పూతలపట్టు ఎన్‌హెచ్-71 జాతీయ రహదారిపై తెల్లవారుజామున నాలుగున్నర సమయంలో చంబడపాలెం గ్రామం వద్ద ప్రమాదం చోటుచేసుకుంది జాతీయ రహదారిపై పోతూ ఉన్న లారీ సడన్గా బ్రేక్ చేయడం వలన వెనుక నుండి కార్ ఢీకొనడం జరిగింది ఇందులో ఐదు మంది ప్రయాణించగా ఇద్దరు తీవ్ర గాయాలయ్యాయి ముగ్గురు స్వల్పకాయలతో బయటపడ్డారు వీరిని 1033 ఎన్ హెచ్ ఐ అంబులెన్స్ చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ తరలించడం జరిగింది . నవ్య 26 సంవత్సరాలు లహరి 20 సంవత్సరాలు సరస్వతి 50 సంవత్సరాలు మీనా 45 సంవత్సరాలు. సరస్వతి నీ ఎంజీఎం నుండి రేణిగుంట అమర హాస్పిటల్కు తరలించే మార్గమధ్య లోనే సరస్వతి అనే ఆవిడ చనిపోవడం జరిగింది విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖానికి గురయ్యారు

## వైద్య ఆరోగ్య సిబ్బందిచే హాస్టల్ పరిశీలన



**శ్రీకాళహస్తిరూరల్: పెన్ పవర్ ప్రతినిధి జూన్ 28:** ఏర్పేడు మండల కేంద్రంలోని బిసి బాలుర హాస్టల్ను శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పారామెడికల్ సిబ్బంది. తనికీ చేసారు. వీరు పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత గురించి అక్కడ వార్డెన్ సిబ్బందికి సూచనలిచ్చారు. మంచినీటిని పరిశీలించారు. అలాగే హాస్టల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తరువాత విద్యార్థుల ఆరోగ్యపరీక్షలను నిర్వహించారు. సమస్యలున్న వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ సూపర్వైజర్ సుబ్బరాయుడు, తులసీనాథ్, ఎఎన్ఎం రేటా, ఆశా వర్కర్ లత, లోటా కుమారి, వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లును రద్దు చెయ్యాలి
## ఐక్య కార్మిక సంఘాల డిమాండ్



**కడప పెన్ పవర్ జూన్ 28 :** జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకులిఏఐటీయూసీ, సీఐటీయూ, యుటియుసి, ఎఐసిసిటియు, టియుసి, ఐఫ్ టియు, పిలుపు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కోరుతూ జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎల్. నాగసుబ్బరెడ్డి, బీ.మనోహర్, ఐ ఎఫ్ టి యు, జిల్లా నాయకులు డబ్ల్యూ, రాము.యుటియుసి జిల్లా నాయకులు కె.సుబ్బరాయాడు. ఎఐసిసిటియు జిల్లా నాయకులు ఓబయ్య, యుటి యుసి జిల్లా నాయకులు రమణయ్య, డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హెూచిమిన్ భవన్ ఏఐటీయూసీ ఆఫీస్ లో కార్మిక రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రానికి ముందుగాని, తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవి కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 4 లేబర్ కోడ్స్ అమలులో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు 10 గంటలు పని విధానం ముందుకు తెచ్చారని కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ చంద్రబాబు కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, కె శ్రీనివాసులురెడ్డి, ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, ఏఐటీయూసీ నగర నాయకులు లింగన్న, మల్లికార్జున, పుల్లయ్య, నాగిరెడ్డి, శాంతమ్మ, అమ్ములు, ఏపి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, వెంకటసుబ్బయ్య, గోపి , నరసింహ రావు, పవన్ కుమార్, స్టీఫెన్, కొండయ్య, పాల్గొన్నారు.

# మంత్రుల ముచ్చట.. ఏపీలో ఒకలా.. తెలంగాణలో మరోలా!



**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో మంత్రుల వ్యవహారం.. తరచుగా చర్చకు వస్తూనే ఉంది. అయితే.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం అన్నట్టుగా రెండు రాష్ట్రాల్లోనూ మంత్రుల వ్యవహారంలో తేడాలు ఉన్నా.. పద్ధతి మాత్రం ఒక్కటే అన్నట్టుగా ఉంది. ఏపీ విషయాన్ని తీసుకుంటే.. సీఎం చంద్రబాబుపై మంత్రులు ఎవరూ కామెంట్లు చేయరు. కానీ, తెరచాటున మాత్రం వారు చేయాలనుకున్నదే చేస్తున్నారు. అధినేత మాట వింటారు. కానీ, వారు ఏం చేయాలని తలపోస్తే అదే చేస్తున్నారు. ఉదాహరణకు .. ప్రజల్లో ఉండాలని చంద్రబాబు చెబితే.. ఓకే అంటారు. కానీ.. ప్రజల్లోకి వెళ్లినట్టే వెళ్లి సొంత పనులు చక్కపెట్టుకునే వారు 15 మంది వరకు ఉన్నారు. ఇది టీడీపీ లెక్క. మరి చంద్రబాబు మాట వినడం లేదా? అంటే.. వింటున్నారు. మీడియా ముందుకు వచ్చి వైసీపీపై నాలుగు విమర్శలు చేస్తారు. నియోజకవర్గానికి వెళ్తున్నట్టుగా వెళ్లి.. సొంత ఫొటోగ్రాఫర్లతో ఫొటోలు తీసుకుని.. వాటిని సోషల్ మీడియాకు ఇచ్చి.. ప్రచారం చేస్తున్నారు. తద్వారా అధినేత కళ్లకు చక్కటి గంతలు కడుతున్నారు. మరి ఈ విషయం చంద్రబాబుకు తెలిసో తెలియదో కానీ.. జరగాల్సింది జరిగిపోతోంది. ప్రజాదర్బార్‌ల పేరిట వారం వారం తమ తమ నియోజకవర్గాల్లో ఉండాలని చంద్రబాబు చెప్పారు. ఉండడమే కదా! అనుకుంటున్న నాయకులు అలానే చేస్తున్నారు. కానీ, సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. తాజాగా విశాఖ, తూర్పు, అనంతపురం జిల్లాల్లో కీలక మంత్రులకు ప్రజల నుంచి భారీ సెగ తగిలింది. తాము సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా.. పరిష్కారం కాలేదని.. ధర్నాలుచేశారు. ఇక, తెలంగాణ విషయానికి వస్తే.. అంతర్గత కుమ్ములాటలు మంత్రుల పేషీల్లోనే జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డిపై నేరుగా విమర్శలు చేస్తున్నవారు కనిపిస్తున్నాయి. ఇది తప్పుకాదని కూడా వారు సమ ర్థించుకుంటున్నారు. తమది అతి పెద్ద.. అంతర్గత ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ అని చెప్పుకొంటున్నారు. తాజాగా పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన హైదరాబాద్‌కు చెందిన మంత్రి ఒకరు.. సీఎంపై ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఇది బయటకు రాకుండా ఆమె రెండు రోజులు తొక్కి పెట్టారు. కానీ, దాగలేదు. పోనీ.. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నట్టు మంత్రులు వింటున్నారా? అంటే.. అది కూడా కనిపించడం లేదు. ఒకరి శాఖలో మరొకరు జోక్యం చేసుకోవద్దని అంటున్నా.. ఎవరూ చెవిన పెట్టడం లేదు. కొండా సురేఖ శాఖలో ఓ మంత్రి వేలు పెట్టారు. ఇదే.. అసలు వివాదానికి కారణమని లేటుగా తేలింది. ఇలా.. మంత్రులు ఎవరికి నచ్చిన రీతిలో వారు ఉంటున్నారు. మరొకరు.. గౌడ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని ఆ వర్గాన్ని రెచ్చగొట్టి సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు పంపించారు. ఇలాంటి పరిణామాలతో ఇరు రాష్ట్రాల్లోనూ మంత్రుల వ్యవహారం రోజుకోరచ్చగా మారుతోంది.

# 'అతి' ఎప్పుడూ మంచిది కాదు బాబూ ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** నాయకుల కోణం వేరు.. ప్రజల కోణం వేరు. అతిగా ఏం చేసినా.. ప్రజలు అంతే అతిగా తీసుకుంటారు. అది ఎవరికీ మంచిది కాదు. గతంలో చంద్రబాబును తిట్టించిన, పవన్‌ను దూషించిన నాయకుల పరిస్థితి ఏమైంది? రెండు చోట్ల ఓడిపోయారంటూ.. మూడు పెళ్లిళ్లు చేసుకున్నారంటూ.. పవన్‌పై చేసిన విమర్శల జడి అతిగా మారి.. చివరకు వైసీపీ పుట్టిముంచింది. చంద్రబాబును జైల్లో పెట్టేస్తే.. ఇక, తనకు తిరుగు ఉండదని అనుకుని అతికిపోయిన జగన్ పరిస్థితి ఏమైందో తెలిసిందే.

సో.. అతి అనేది రాజకీయాల్లో ఎంత ప్రమాదమో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఇది ఒక్క వైసీపీకే కాదు. రాజకీయాల్లో పార్టీలకు.. నాయకులకు శాశ్వత శత్రువులుకానీ... శాశ్వత మిత్రులు కానీ.. లేనట్టుగానే.. ప్రజ లకు కూడా ఇలానే %–%శాశ్వత అధికార పార్టీ%–% ఉందా? ఉంటుందా?.. పురుచ్చితలైవిగా పేరొంది, వీధి వీధికీ గుడి కట్టించుకున్న జయలలితను కూడా ఓడించారు. ఒడిశాబీ పశ్చిమ బెంగాల్‌లలో కూడా.. అధికారం శాశ్వతం అనుకున్న వారు పక్కకు తప్పుకోక తప్పలేదు. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. టీడీపీలోని మేధావి వర్గం రహస్యంగా విజయవాడలో భేటీ అయింది. ఈ సందర్భంగా.. భవిష్యత్తు రాజకీయ పరిణామాలపై అంచనా వేసింది. వీరిలో ఒకరిద్దరు నిత్యం చంద్రబాబుకు టచ్‌లో ఉండేవారేనని సమాచారం. ఈ క్రమంలోనే ప్రస్తుతం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్య లు.. ఫ్యూచర్ పాలిటిక్స్‌పై చర్చించిన మేధావులు.. అతి మంచిది కాదని తీర్మానానికి వచ్చారు. ప్రజలకు మంచి చేయడం, పెట్టుబడులు తీసుకురావడం వరకు కరెక్టేనని.. కానీ.. ప్రతిపక్షాన్ని అతిగా ప్రస్తావించడం ద్వారా.. ఇబ్బందులు వస్తాయన్నది వీరు చెబుతున్న మాట. అయితే.. ఈ రహస్య సమావేశం ఎక్కడ జరిగింది? అనేది గుట్టుగా ఉంచారు. అధికారంలోకి మళ్లీ వచ్చేస్తాం అనే ధీమా చంద్రబాబు వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ ధీమా ఆయన వరకు పరిమితం అయి తే మంచిదేనని.. కానీ, ఇదే ధీమా క్షేత్రస్థాయికి కూడా పాకి పోయిందని.. ఇది గత వైసీపీ 30 ఏళ్ల అధికారం ధీమాగా మారుతోందని మేధావులు అంచనా వేశారు. తద్వారా.. నాయకులు కట్టుతప్పి.. ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరించే ప్రమాదం ఉందని, ఫలితంగా పార్టీ ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉందని టీడీపీ మేదావి వర్గం అంచనా వేస్తోంది. అధికారం ఇవ్వడం.. ఇవ్వకపోవడం అనేది ప్రజల చేతిలో ఉన్న విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందని.. అతిగా ఊహించుకున్నా.. అతిగా అంచనా వేసుకున్నా.. మంచిదికాదన్నదివారు చెబుతున్న మాట. అయితే.. దీనికి సంబంధించిన విషయాలు .. చాలా రహస్యంగా ఉంచారు. ఓ సీనియర్ నాయకుడి ద్వారా ఒకటి రెండు విషయాలు మాత్రమే బయటకు పొక్కడం గమనార్హం. మరి చంద్రబాబుకు వీరు ఈ సూచనలు, సలహాలు ఇస్తారా? ఆయన పాటిస్తారా? అనేది చూడాలి.

# బెంగళూరులో అద్దెలు తగ్గిస్తున్న ఓనర్స్.. టెక్కీలు చేస్తున్న ఆ పనితో..

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం నడుస్తోంది టెక్ ప్రపంచం. అయితే దీనిని వెనుక నుంచి నడిపించేది ఐటీ నిపుణులు, అనేక టెక్ కంపెనీలు. భారతదేశంలో ఐటీ రంగానికి పెట్టింది పేరు బెంగళూరు. ప్రస్తుతం టెక్ రంగం దాదాపు అన్ని రాష్ట్రాల్లోని నగరాలకు విస్తరించినప్పటికీ.. ప్రధానంగా బెంగళూరులో ఇది కేంద్రీకృతం అయ్యింది. అందుకే అక్కడ ఇంటి అద్దెలు కూడా ఊహించని స్థాయిల్లో చెబుతుంటారు ఓనర్స్. సంపాదించినదానిలో దాదాపు సగం అద్దెకు ఖర్చు కావటం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్కడ ఉద్యోగాలు చేస్తున్న వారిని నిరుత్సాహ పరుస్తోంది. ప్రస్తుతం కనీసం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లటానికి ట్రాఫిక్ లో రెండు మూడు గంటలు పట్టడం.. అధిక అద్దెలు, పొల్యూషన్, ప్రయాణ కష్టాలు, భాషా పరమైన ఇబ్బందులు ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడన్ని సమస్యలు బెంగళూరుకు వస్తున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పైగా ఫ్రెషర్లు కూడా తమ చదువు తర్వాత ఉద్యోగాల కోసం బెంగళూరుకు రావటం తగ్గించటంతో నగరంలో పీజీ హాస్టల్స్, ఇళ్లకు డిమాండ్ తగ్గుతోంది.

గతంలో దాదాపు లక్ష నుంచి రెండు లక్షలు డిపాజిట్ తీసుకునే యజమానులు చివర్లో పెయింటింగ్, అది ఇది అంటూ సగం వరకు నొక్కేసేవారు. ఇప్పటికీ ఆ పరిస్థితులు అలాగే ఉన్నాయనుకోండి. దీనికి తోడు ఏటా 20 శాతం వరకు అద్దెల పెంపుతో అసలు సంపాదిస్తోంది వారి కోసమా లేక బెంగళూరులో ఇంటి యజమానుల కోసమా అనే అనుమానం చాలా మందికి కలుగుతోంది. దీనికి తోడు కరోనా సమయంలో నిర్మాణాలు ఆగటం ప్రాజెక్టులు, డెలివరీలను ఆలస్యం చేసింది. కానీ ప్రస్తుతం ఇవి ఊపందుకోవటంతో చాలా మంది వేలకు వేలు అద్దె కట్టడం కంటే అపార్ట్మెంట్ కొనుక్కుని దానికి ఈఎంఐ చెల్లించటం మంచిదని భావిస్తున్నారు. దీంతో చాలా మంది బెంగళూరులో నగరం నడిబొడ్డు నుంచి ఓఆర్ఆర్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చాలా మంది వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా వారి సొంత నగరాలకు దగ్గరలో ఆఫీసులకు తిరిగి మైగ్రేట్ అయిపోవటంతో అద్దె ఇళ్లకు డిమాండ్ తగ్గటం స్టార్ట్ అయ్యింది. చేసేది లేక ఇంటి ఓనర్లు సైతం గతంలో మాదిరిగా రుబాబు చూపించకుండా ఇంటి అద్దెలను తగ్గిస్తున్నారని రెడిట్ వేదికగా కొందరు చెబుతున్నారు. అలాగే అద్దెలు ఇల్లు తీసుకునే ముందు యజమానులతో మాట్లాడటం

ద్వారా 15 శాతం వరకు రెంట్ తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని రెడిట్ యూజర్ చెప్పారు. చాలా మంది అధిక అద్దెలు కట్టలేక తమ యజమా నులను రెంట్స్ తగ్గించాలని కోరుతున్నారని వెల్లడించారు. అనేక చోట్ల ఇళ్లు టూలెట్స్ పెడుతుంటే ఎంక్వైరీలు కూడా తక్కువగా వస్తున్నాయని, అధిక అద్దెలకు ఉండేందుకు బెంగళూరులో ఎవ్వరూ ఇష్టపడటం లేదని వెల్లడైంది. ఇది చూస్తుంటే వాస్తవ పరిస్థితులను ఇంటి యజమానులు కూడా అర్థం చేసుకుంటున్నారనిపిస్తోంది.







# మహా న్యూస్ ఛానెల్? ఆఫీసుపై BRS దాడి : ఖండించిన ప్రముఖులు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహా న్యూస్ ఛానెల్ ఆఫీసుపై దాడి జరిగింది. 2025, జూన్ 28వ తేదీ మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. 30 నుంచి 40 మంది వరకు ఉన్న వాళ్లు.. వస్తూ వస్తూనే.. ఆఫీసు ఎదుట ఉన్న రెండు కార్లను ధ్వంసం చేశారు. పెద్ద పెద్ద రాళ్లను కార్లపై వేశారు. కార్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ వెంటనే మరికొంత మంది ఆఫీసుపై రాళ్లు వేశారు. రెండు, మూడు అంతస్తుల్లో ఉన్న కిటికీలు ధ్వంసం అయ్యాయి. ఈ రాళు ఆఫీసులో పని చేస్తున్న ఉద్యోగులపై పడ్డాయి. కొంత మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఆఫీసుకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. ఆఫీసులోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కంప్యూటర్లు పగలగొట్టారు. రాళ్లు, కర్రలు, రాడ్లతో విధ్వంసం చేశారు. అద్దాలు ధ్వంసం చేశారు. ఆఫీసులో బీభత్సం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై సిట్ విచారణ కొనసాగుతుంది. ఈ విచారణకు సంబంధించి.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోని అంశాలపై మహా న్యూస్ ఛానెల్ లో కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ కథనాలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, అప్పటి మంత్రి కేటీఆర్ కు వ్యతిరేకంగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు.. మహా న్యూస్ ఛానెల్ యాజమాన్యం స్పష్టం చేసింది. మీడియాలో వచ్చిన కథనాలపై అభ్యంతరాలు ఉంటే కూర్చుని మాట్లాడుకుందాం అని ఉద్యోగులు, సిబ్బంది చెప్పినా వినకుండా.. అత్యంత దారుణంగా.. కిరాతకంగా దాడి చేసినట్లు చెబుతున్నారు అక్కడి ఉద్యోగులు.



మహాన్యూస్ ఛానెల్ పై దాడిని చాలా మంది ఖండించారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. మీడియా స్వేచ్ఛను దాడులతో అణిచివేస్తాం అనుకుంటే పొరపాటు అంటూ చెప్పుకొచ్చారు. భౌతిక దాడులు సరికాదన్నారు. నిందితులను ఇప్పటికే గుర్తించాం అని..

త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. మీడియాపై దాడి అనేది హేయమైన చర్య అంటూ ఖండించారు మంత్రి. మహా న్యూస్ ఛానెల్ ఆఫీసులో బీఆర్ఎస్ కార్యకర్తల విధ్వంసంపై మీడియా అసోసియేషన్లు కూడా స్పందించాయి. దాడిని ఖండించారు.

# హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ ఏటీఎంలో దొంగనోట్లు... బ్యాంకు ఉద్యోగులకే షాక్..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ లోని ప్రముఖ బ్యాంకుకి చెందిన ఏటీఎంలో దొంగనోట్లు రావడం కలకలం రేపింది. ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేద్దామని వెళ్లిన ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు ఏటీఎంలో దొంగనోట్లు రావడంతో షాక్ అయ్యారు. రూ. 5 వేలు డ్రా చేయగా.. మొత్తం నకిలీ రూ. 500 నోట్లు వచ్చినట్లు తెలిపారు బాధితులు. ఈ ఘటనపై బ్యాంకు మేనేజర్ కి ఫిర్యాదు చేశారు ఉద్యోగులు. ఏటీఎంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా.. గుర్తు తెలియని వ్యక్తి కస్టమర్ లా వచ్చి క్యాష్ డిపాజిట్ చేసి వెళ్లినట్లు గుర్తించారు బ్యాంకు సిబ్బంది.

ఈ ఘటనపై ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు సిబ్బంది. బ్యాంకు సిబ్బంది ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు పోలీసులు. ఇప్పుడంటే యూపీఐ పేమెంట్స్ కి అలవాటు పడి చాలామంది క్యాష్ మెయింటైన్ చేయడం తక్కువయ్యింది కానీ.. నకిలీ నోట్ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏకంగా ఏటీఎంలోనే నకిలీ నోట్లు డిపాజిట్ చేశారంటే.. దుండగులు ఏ రేంజ్ కి ఎదిగిపోయారో అర్థమవుతుంది. కాబట్టి.. ఇక మీదట ఏటీఎంలో క్యాష్ విత్ డ్రా చేసినా కూడా ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం బెటర్.

# స్కూళ్లలో జుంబా డ్యాన్స్?.. వ్యతిరేకిస్తున్న ముస్లిం సంఘాలు !

**హైదరాబాద్ పెన్ పవర్:** స్టూడెంట్స్ కేవలం క్లాసులు, చదువు, పరీక్షలు, హోం వర్క్ అనే దానికే పరిమితం కాకుండా.. ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండేందుకు కేరళ ప్రభుత్వం స్కూళ్లలో జుంబా డ్యాన్ ప్రవేశపెట్టింది. విద్యార్థుల ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ కోసం ప్రతి రోజు జుంబా డ్యాన్స్ చేయించాలని నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు కూడా చాలా ఉత్సాహంగా డ్యాన్స్ లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఒకవైపు ప్రశంసలు వస్తుంటే.. మరోవైపు విమర్శలు ఎదురవుతున్నాయి. కేరళలో స్కూల్స్ లో జుంబా డ్యాన్స్ ఇంట్రడ్యూస్ చేయడం వివాదాస్పందా మారింది. యాంటీ–డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగా ఈ డ్యాన్స్ ను ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెబుతుంటే.. ముస్లిం సంఘాలు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. గర్ల్స్, బాయ్స్ ఒకే చోట కలిసి డ్యాన్స్ చేయడం.. అందులో పొట్టి డ్రెస్ లతో జుంబా డ్యాన్స్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది నుంచి జుంబా డాన్స్ ట్రైయినింగ్ ను స్టార్ట్ చేస్తున్నట్లు చాలా స్కూల్స్ అనౌన్స్ చేశాయి. దీనిపై ముస్లి సంఘాలా ఆందోళ వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజ్డమ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. దీన్ని తాము అంగీకరించమని.. ఈ సెషన్స్ లో తమ కుమారుడు పార్టిసిపేట్ చేయడని ఫేస్ బుక్ పోస్టులో ప్రకటించారు. ముస్లిం ఆర్గనైజేషన్ సమస్త సంఘానికి చెందిన మరో లీడర్.. నాసర్ ఫైజీ కూడ్తాయ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత స్వేచ్ఛ హననం, వల్గారిటీ పెంచినట్లవుతుందని విమర్శించారు. జుంబా అమ్మాయిలు అబ్బాయిలు ఇద్దరూ కలిసి చేసే డాన్స్. చిన్న చిన్న డ్రెస్ లు వేసుకుని చేసే డాన్స్. ఇది చాలా అభ్యంతరకరం అని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఫిజికల్ ప్రోగ్రామ్స్ ను కాదని.. వల్గారిటీని ఇంప్లిమెంట్ చేయడం ఎంతవరకు సమంజసం అని ముస్లిం సంఘాలు ప్రశ్నిస్తున్నారు.



### యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగానే..

స్కూళ్లలో జుంబా డ్యాన్స్ యాంటీ–డ్రగ్ క్యాంపెయిన్ లో భాగమేనని కేరళ విద్యా శాఖ మంత్రి వి.శివంకుట్టీ అన్నారు. ముస్లిం విద్యార్థులు కూడా ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేశారు. "పిల్లలు సరదాగా ఆడాలి, పాడాలి, లాఫ్, ఫన్, హ్యాపీనెస్ తో పాటు పెరగాలి" అని అన్నారు. స్టూడెండ్స్ డ్రెస్ పై వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. ఇలాంటి ఆలోచనలు పిల్లల మనసుల్లో డ్రగ్స్ ను మించిన విషాన్ని నింపుతాయని అన్నారు. 'పిల్లలు పొట్టి దుస్తులు వేసుకొమ్మని ఎవరూ అడగటం లేదు.. వాళ్లు స్కూల్ యూనిఫామ్స్ వేసుకుంటున్నారని చెప్పారు.

విద్యా హక్కు చట్టం (%=ుజు%) ప్రకారం.. పిల్లలు లెర్నింగ్ ప్రాసెస్ లో పార్టిసిపేట్ చేయాలని.. ఇందులో పేరెంట్స్ జోక్యం చేసుకునే అవకాశం లేదని తెలిపారు. "ఇది యాంటీ డ్రగ్ క్యాంపెయిన్.. అవేర్ నెస్ ప్రోగ్రామ్ లో భాగంగా కండక్ట్ చేస్తున్నాం. అలాంటి ఆలోచనలు పిల్లల్లో విభజన సంస్కృతిని డెవలప్ చేస్తాయి" అని బదులిచ్చారు. ఇంతకు ముందు జుంబా డాన్స్ పిల్లలు ఇష్టపూర్వకంగా, వాలంటరీగా చేరేదని, అందరూ చేయాలనే మ్యాండేటరీ రూల్స్ లేవని ప్రభుత్వం ప్రకటించింది. పిల్లల్లో స్ట్రెస్ తగ్గించి, ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ తో పాటు కాన్ఫిడెన్స్ పెంపొందిచేందుకు అందరూ పార్టిసిపేట్ చేయిస్తున్నట్లు తెలిపింది. టీచర్లు కూడా జుంబా డాన్స్ కోసం స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటారు. విద్యార్థులు, టీచర్లు కలిసి జుంబా డాన్స్ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. దీనిపై కొందరు విమర్శిస్తుంటే.. మరి కొందరు చాలా మంచి నిర్ణయమని ఆహ్వానిస్తున్నారు.

# నెట్ ప్రాక్టీసుకు బుమ్రా హాజరు... రెండో టెస్టు ఆడతాడా?

- రెండో టెస్టుకు ముందు టీమిండియా ప్రాక్టీస్‌లో చేరిన జస్ప్రీత్ బుమ్రా
- శనివారం నెట్స్‌లో తీవ్రంగా బౌలింగ్ చేసిన బుమ్రా, ప్రసిద్ధ్, సిరాజ్
- హెడింగ్లీలో ఓటమి తర్వాత జట్టులో పెరిగిన కసి
- పనిభారం కారణంగా బుమ్రా తుది జట్టు ఎంపికపై ఇంకా అనిశ్చితి
- సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా బుమ్రా ఎంపికపై నిర్ణయమన్న కోచ్ గంభీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమిండియాకు కీలకమైన రెండో టెస్టుకు ముందు పెద్ద ఊరట లభించింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా శనివారం నెట్ ప్రాక్టీసుకు హాజరయ్యాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టు కోసం జరుగుతున్న సన్నాహాల్లో భాగంగా అతను నెట్స్‌లో బౌలింగ్ చేయడంతో జట్టు బౌలింగ్ విభాగంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. హెడింగ్లీలో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయి 0-1తో వెనుకబడిన భారత్, రెండో టెస్టు కోసం శుక్రవారం నుంచే కసరత్తులు ప్రారంభించింది. అయితే, తొలి రోజు ప్రాక్టీస్ సెషన్‌కు బుమ్రా, మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ దూరంగా ఉండటంతో వారి ఫిట్‌నెస్‌పై అనుమానాలు తలెత్తాయి. దానికి తోడు బుమ్రాకు పనిభారం తగ్గించడానికి, రొటేషన్ విధానంలో భాగంగా రెండో టెస్టుకు విశ్రాంతి ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే, శనివారం నాటి ప్రాక్టీస్‌తో ఆ అనుమానాలకు తెరపడింది. బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్ ముగ్గురూ నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేయడంతో జట్టులో కొత్త ఉత్సాహం నెలకొంది. తొలి రోజు బ్యాటింగ్‌పై దృష్టి పెట్టిన సిరాజ్, రెండో రోజు బౌలింగ్‌కు పదును పెట్టాడు. బ్యాటర్ల విషయానికొస్తే, తొలి టెస్టులో అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్ శనివారం నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన వారిలో మొదటివాడిగా నిలిచాడు. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్-కెప్టెన్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ శనివారం నాటి శిక్షణా శిబిరానికి దూరంగా ఉన్నారు. వీరంతా శుక్రవారం నెట్స్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడమే ఇందుకు కారణం. బుమ్రా తిరిగి ప్రాక్టీస్‌లో పాల్గొనడం జట్టుకు సానుకూల సంకేతమే అయినప్పటికీ, ఎడ్జ్‌బాస్టన్ టెస్టు తుది జట్టులో అతని స్థానంపై ఇంకా స్పష్టత రాలేదు. తొలి టెస్టులో ఏకంగా 44 ఓవర్ల పాటు శ్రమించిన 31 ఏళ్ల బుమ్రాపై పనిభారం పెరగకుండా చూసేందుకు యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సిరీస్‌లోని ఐదు టెస్టుల్లో కేవలం మూడింటిలోనే అతడిని ఆడించాలని భావిస్తున్నట్లు సమాచారం. హెడింగ్లీ ఓటమి అనంతరం మాట్లాడిన హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా బుమ్రా ఎంపికపై ప్రతీ మ్యాచ్‌కు ముందు ప్రత్యేకంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రస్తుతం బౌలింగ్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన టీమిండియా, ఎడ్జ్‌బాస్టన్‌లో విజయం సాధించి సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం తమ ప్రధాన పేసర్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జట్టు ఆశిస్తోంది.

# శ్రీలంక చేతిలో ఘోర ఓటమి.. టెస్ట్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన శాంటో





**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక తో రెండో టెస్టులో ఓటమి తర్వాత బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో తన సారధ్య బాధ్యతలకు రాజీనామా చేశాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్టు శనివారం (జూన్ 28) అధికారికంగా ప్రకటించాడు. టెస్ట్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని "కొన్ని రోజుల క్రితమే" బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ విభాగానికి తెలియజేసినట్లు నజ్ముల్ హుస్సేన్ శాంటో తెలిపారు. ఇటీవలే శాంటోను వన్డే కెప్టెన్ నుంచి తొలగించి అతని స్థానంలో మెహిదీ హసన్ మిరాజ్‌ను నియమించారు. టెస్ట్ కెప్టెన్ కు కూడా గుడ్ బై చెప్పడంతో మెహిదీ హసన్ మిరాజ్ కు టెస్ట్ నాయకత్వ బాధ్యతలను అప్పజెప్పే అవకాశం ఉంది. "టెస్ట్ ఫార్మాట్‌లో నేను ఇకపై కెప్టెన్‌గా కొనసాగాలనుకోవడం లేదు. జట్టు శ్రేయస్సు కోసమే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. మూడు ఫార్మాట్లకు ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు ఉండటం 'సమంజసమైనది కాదు. నా నిర్ణయం జట్టుకు సహాయపడుతుందని నేను భావిస్తున్నాను. గత కొన్ని సంవత్సరాలుగా నేను డ్రెస్సింగ్ రూమ్‌లో భాగమయ్యాను. ఇది నా వ్యక్తిగత నిర్ణయం. ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు జట్టులో ఉండడం కష్టమని నేను భావిస్తున్నాను".అని లంక చేతిలో ఓటమి తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో శాంటో అన్నాడు. శాంటో రెండో టెస్టులో విఫలమైనా.. తొలి టెస్టులో అదరగొట్టాడు. రెండు ఇన్నింగ్స్ ల్లో సెంచరీలు చేసి చరిత్ర సృష్టించాడు. ఇకపై శాంటో ప్లేయర్ గా మాత్రమే జట్టులో కొనసాగనున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే కొలంబో వేదికగా సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ లో శ్రీలంకపై బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో ఓడిపోయింది. 6 వికెట్ల నష్టానికి 115 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన బంగ్లాదేశ్ మరో 18 పరుగులు జోడించి చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ 247 పరుగులు చేసింది. అనంతరంశ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్ లో 458 పరుగుల భారీ స్కోర్ చేసి 211 పరుగుల లీడ్ సంపాదించింది. రెండో ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ 133 పరుగులకు ఆలౌటైంది.

# మూడేళ్ళలో మూడు సర్జరీలు: బంగ్లా సిరీస్‌కు సూర్య డౌట్.. టీమిండియా టీ20 కెప్టెన్‌గా అక్షర్ పటేల్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెలలో భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ గడ్డపై వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. ఈ పర్యటనలో భాగంగా మొత్తం మూడు వన్డేలతో పాటు మూడు టీ20 మ్యాచ్ లు ఆడనుంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా బంగ్లాదేశ్ కు వెళ్తుంది. ఆగస్టు నెలలో బంగ్లాదేశ్ తో జరగబోయే టీ20 సిరీస్ కు టీ20 కెప్టెన్ సూర్య దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్య కుమార్ వరుస సర్జరీలతో ఇబ్బందిపడుతున్నాడు. గురువారం (జూన్ 26) జర్మనీలోని మ్యూనిచ్‌లో సూర్య స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. 'కుడి వైపు పొత్తి కడుపులో ఉన్న హెర్నియాకు డాక్టర్లు విజయవంతంగా సర్జరీ చేశారు.మూడేళ్లలో సూర్యకుమార్‌కు ఇది మూడో సర్జరీ. 2023లో చీలమండకు ఆపరేషన్ చేయించుకున్న అతను 2024లోనూ స్పోర్ట్స్ హెర్నియాకు చికిత్స తీసుకున్నాడు. సర్జరీ చేయడంతో ఈ టీమిండియా టీ20 కెప్టెన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఈ ఆపరేషన్ తర్వాత రెండు వారాల్లో బెంగళూరులోని ఎన్‌సీఏలో రిహాబిలిటేషన్ మొదలుపెట్టనున్నాడు. బంగ్లాదేశ్ తో సిరీస్ కావడంతో ఈ సిరీస్ సమయానికి కోలుకున్నా సూర్యకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం భారత జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉన్న అక్షర్ పటేల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టవచ్చు.ఈ ఏడాది ప్రారంభంలో ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్ కు అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. ఒకవేళ అక్షర్ కాకపోతే శుభమాన్ గిల్ కెప్టెన్ గా జట్టును నడిపించవచ్చు. ఆగస్టు 26న బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. 2026 లో భారత్ వేదికగా టీ20 వరల్డ్ కప్ జరగనుండడంతో ఈ సిరీస్ కు భారత క్రికెట్ జట్టు పూర్తి స్థాయి జట్టుతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ ఆగస్ట్ 26 న చట్టోగ్రామ్ వేదికగా జరుగుతుంది. ఆగస్టు 29, ఆగస్టు 31 న వరుసగా రెండు, మూడు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. ఆగస్టు 17 నుంచి 23 మధ్యలో మొదటగా వన్డే సిరీస్ జరుగుతుంది.

**2025లో బంగ్లాదేశ్ పర్యటనకు భారత జట్టు షెడ్యూల్:**

ఆగస్టు 17.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. తొలి వన్డే.. మీర్పూర్
ఆగస్టు 20.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. రెండో వన్డే.. మీర్పూర్
ఆగస్టు 23.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. మూడో వన్డే.. చట్టోగ్రామ్
ఆగస్టు 26 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. తొలి టీ20.. చట్టోగ్రామ్
ఆగస్టు 29 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. 2వ టీ20.. మీర్పూర్
ఆగస్టు 31 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. 3వ టీ20.. మీర్పూర్



ఆకాంక్ష శర్మ తన గ్లామర్ డోస్ పెంచింది

# ఖైదీ2లో దిల్లీకి భార్యగా ఆ స్టార్ హీరోయిన్?



కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన ఖైదీ సినిమా ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ గా ఖైదీ2 రాబోతుండగా, ఆల్రెడీ ఆ మూవీ కోసం ఆడియన్స్ ఎంతో ఎగ్జైటెడ్ గా ఉన్నారు. అయితే ఖైదీ2 లో సౌత్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి నటించే అవకాశాలున్నట్టు వార్తలు వస్తుండటంతో ఖైదీ2 పై ఉన్న అంచనాలు ఇంకాస్త పెరిగాయి. అనుష్క ఖైదీ2 లో నటిస్తుందని వార్త అలా వచ్చిందో లేదో వెంటనే ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. ఖైదీ2లో అనుష్క దిల్లీ భార్యగా మరింత పవర్‌ఫుల్ రోల్ లో నటించనుందనే వార్త ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఇన్ని వార్తలొస్తున్నప్పటికీ ఈ విషయంలో నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వచ్చింది లేదు. కాబట్టి ఖైదీ2లో అనుష్క నటిస్తుందనే వార్త ఇప్పటికైతే కేవలం ఊహాగానాలు మాత్రమే. ఖైదీ2లో అనుష్క క్యారెక్టర్ చాలా స్పెషల్ గా ఉండటంతో పాటూ, ఆ క్యారెక్టర్ కేవలం సపోర్టింగ్ రోల్ లా ఉండదని మొదట్లో వార్త రాగా, తర్వాత ఆ న్యూస్ వైరలైంది. అనుష్క మాత్రమే కాదు, ఖైదీ2లో మరికొన్ని క్యామియోలు కూడా ఆడియన్స్ ను ఆశ్చర్యపరచనున్నట్టు తెలుస్తున్నాయి. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా ఖైదీ2 సినిమాలో విక్రమ్, రోలెక్స్ గా కమల్ హాసన్, సూర్య కూడా జతకట్టే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది. నిజంగానే వీరంతా ఖైదీ2 లో నటిస్తే ఈ సినిమా సౌత్ ఇండియన్ సినిమాల్లోనే అతి పెద్ద సినిమాగా మారే అవకాశముంది.

అయితే అనుష్క, కార్తీ కలిసి స్క్రీన్ ను షేర్ చేసుకోవడం ఇది మొదటిసారేం కాదు. గతంలో వీరిద్దరూ కలిసి అలెక్స్ పాండియన్ లో నటించారు. ఆ తర్వాత కార్తీ నటించిన శకుని, ఊపిరి సినిమాల్లో అనుష్క స్పెషల్ క్యామియో చేశారు. ఇప్పుడు ఖైదీ2లో వీరిద్దరూ కలిసి నటిస్తే అది సినిమాకు మంచి హైప్ ను తీసుకురాగలదు. అయితే అనుష్క ఖైదీ2 చేస్తున్నారా లేదా అనేది మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు క్లారిటీ రాదు. అనుష్క ఖైదీ2 చేసినా చేయకపోయినా ఆమె కెరీర్ మాత్రం చాలా స్ట్రాంగ్ గా కనిపిస్తుంది. ప్రస్తుతం క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఘాటి చేస్తున్న అనుష్క ఆ సినిమాను జులై 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ గా రాబోతున్న ఈ సినిమాలో అనుష్క క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుందని ఆల్రెడీ రిలీజైన టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. ఘాటితో పాటూ మలయాళ సినిమా కథనర్ లో కూడా అనుష్క ఓ కీలక పాత్ర చేస్తున్నారు.



పాలక్ తివారీ తన స్టైల్‌పై గందరగోళం లో ఉన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com